

# దివ్యచైతన్య స్రవంతి

# సద్గురు శ్రీ నాన్నగారు

దివ్యచైతన్యస్రవంతి

# సద్గురు శ్రీ నాన్నగారు

# దివ్యచైతన్యప్రవంతి : సద్గురు శ్రీ నాన్నగారు

రచన:
**మ. శివరామకృష్ణ**

సెప్టెంబర్ 23, 2009

**రూ. 20/-**

డిటిపి & లేఅవుట్
**కె. రవిప్రభ**
**జి.వి. కృష్ణమూర్తి**

కవర్ డిజైన్ & ప్రింటింగ్
**కళాజ్యోతి ప్రాసెస్ ప్రై.లిమిటెడ్**
**ముషీరాబాద్, హైదరాబాద్**

శ్రీ నాన్నగారికి
భక్తిప్రపత్తులతో...

# విషయసూచిక


| | పేజీ నెం. |
|---|---|
| ముందుమాట | 7 |
| నాన్నగారి స్వగతం | 8 |
| దివ్యచైతన్యస్రవంతి | 11 |
| శ్రీనాన్నగారితో ముఖాముఖి | 54 |

# ముందుమాట

ఈ చిన్న పుస్తకం వ్రాయటానికి, ప్రచురణ జరగటానికి సద్గురు శ్రీనాన్నగారి ఆశీస్సులే కారణం. వారికి ఎన్నో విధాలుగా కృతజ్ఞుణ్ణి. వారితో పరిచయం అయిన నాటినుండి కలిగిన కొన్ని అనుభవాల, ఆలోచనల అక్షరరూపమే ఇది. ఇది వారి అభిమానులకి, భక్తులకి అంగీకారయోగ్యమవుతుందని తలుస్తాను.

ఈ ప్రయత్నంలో అన్ని విధాల సహకరించి, ముద్రణకు రూపుదిద్దిన నిమిషకవి స్వరాజ్యలక్ష్మిగారికి ఎంతో రుణపడి ఉన్నాను. సౌహార్ద్రంతో, సహనంతో నా ఆలోచనలకి అండగా నిలిచారు ఆమె. నా కృతజ్ఞతలు. ముఖచిత్రానికి శ్రీ నాన్నగారి చక్కటి ఫొటో ఇచ్చిన డా॥ఉషగారికి ఎన్నో కృతజ్ఞతలు.

కొంత భాగం డిటిపి చేయించిన శ్రీ జి.వి. కృష్ణమూర్తి గారికి, ఫైనల్‌గా డిటిపి, లేఅవుట్ మొదలైనవి చేసిన కె. రవిప్రభ గారికి కృతజ్ఞతలు.

శ్రీ నాన్నగారి 75వ జన్మదిన సందర్భంగా ఇది వెలువడటం మనందరికీ ఆశీఃపూర్వకమైన అదృష్టం.

– మ. శివరామకృష్ణ

23 సెప్టెంబర్, 2009

# నాన్నగారి స్వగతం

శ్రీ వెంకట లక్ష్మీనరసింహరాజుగారిని భక్తులు ప్రేమతో "శ్రీ నాన్నగారు" అని పిలుస్తారు. శ్రీ నాన్నగారిని గురించి ఆయన తన స్వహస్తాలతో వ్రాసి, పత్రికలకు విడుదల చేయగా "ఆంధ్రపత్రిక" (దినపత్రిక)లో ప్రచురించబడిన వ్యాసాన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాం.

"నాది పశ్చిమ గోదావరి జిల్లా, జిన్నూరు గ్రామము. నేను ది. 23-09-1934న ఒక వ్యవసాయకుటుంబములో జన్మించాను. 1954వ సంవత్సరములో మా అమ్మమ్మగారైన సీతమ్మగారితో కలిసి ఉత్తరాది పుణ్యక్షేత్రాలన్నీ దర్శించుకొని వచ్చాను.

అది 1957వ సంవత్సరము ఒక రోజు రాత్రి నాకు ఒక స్వప్నము వచ్చింది. ఆ స్వప్నములో చేతిలో కర్రవున్న ఒక వృద్ధ వ్యక్తి వచ్చి మంచము మీదనుంచి లేవదీసి, నన్ను మూడుసార్లు కుడి బుగ్గమీద ముద్దుపెట్టుకున్నారు. నా జోలికి రావద్దని, నన్ను ముద్దుపెట్టుకోవద్దని ఆయనతో గట్టిగా పోరాడినాను. అయినా ఆ అపరిచిత వ్యక్తి నా మాట వినిపించుకోలేదు. ఆయన నా జీవితము మీద దాడి చేస్తున్నట్లు అనిపించినది. నాకెంతో భయము కూడా వేసినది. ఆయన ఒడిలో నుంచి జారిపోవటానికి నేను గట్టిగా ప్రయత్నము చేసినాను. నన్ను ఆయన బలవంతముగా ఎత్తుకొని ఎంతో ఆప్యాయముగా మూడుసార్లు ముద్దు పెట్టుకున్న సమయములో, నా తలక్రిందున్న తలగడ జారిపోయినది. తలగడను స్వయముగా ఆయన చేతితో తీసి జాగ్రత్తగా మంచముమీద సర్ది నాకు ఇసుమంతయు నొప్పి లేకుండా తిరిగి యధావిధిగా నన్ను మంచము

మీద పడుకోబెట్టినారు. నా వంక ఎంతో జాలిగా ఒకసారి చూచి "ప్రస్తుతానికి సరిపోతుందిలే" అని చెప్పి నెమ్మదిగా వెళ్ళిపోయారు. ఇదంతా ఒక డాక్టరు రోగికి ఆపరేషను చేసినట్లుగా అనిపించినది.

నాకు స్వప్నములో దర్శనమిచ్చి. నన్ను లాలించి ఆశీర్వదించిన వ్యక్తి ఎవరో అర్థము కాలేదు. నాకు స్వప్నములో దర్శనమిచ్చిన వ్యక్తిని గురించి ఎవరో తెలుసుకొనుటకు ఆరు మాసాలు తపిస్తూనే ఉన్నాను. ఒక రోజున మా జిన్నూరు గ్రామ లైబ్రరీలో కూర్చొని "ది హిందూ" ఆంగ్ల దినపత్రిక చదువుచున్నాను. అందులో మద్రాసు బుక్ పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించిన "గ్రేట్ మెన్ ఆఫ్ ఇండియా" చూచినాను. భారతదేశములో జన్మించిన పదిమంది మహాత్ముల గురించి ఆంగ్లభాషలో చిన్న పుస్తకములలో ప్రచురించినారు. వారు ప్రచురించిన పేర్లు వరుసగా చదువుచున్నాను. అందులో ఏడవ పేరు "శ్రీ రమణమహర్షి" అని చదివేసరికి నా శరీరము జలదరించి నది. నన్ను ఎవరో కుదిపినట్లనిపించినది. ఆయన పేరు చదవగానే నన్ను ఆకర్షించటమే కాకుండా, నా శరీరమనే గుళ్ళనుండి నేను హృదయగుహలోనికి ప్రవేశించుటకు ఆయన నాకు దారి చూపిస్తారని పించినది. ఈ వ్యక్తి ఎవరో నా మనస్సును పక్వము చేయుటకు వచ్చినట్లుగా స్ఫురించినది. బుద్ధి విశాలమైనట్లుగా అనిపించినది. వెంటనే మద్రాసు కంపెనీ వారికి వ్రాసి "శ్రీరమణ మహర్షి" అను పుస్తకము పోస్టుద్వారా తెప్పించినాను. ఆ పుస్తకములో ఆయన పటమును కూడా ముద్రించినారు. నాకు ఆరు మాసముల పూర్వము స్వప్నములో దర్శనమిచ్చి ఆశీర్వదించిన అవతారపురుషుడు ఈ పటములో ఉన్న "శ్రీ రమణ మహర్షు"ల వారు అని తెలిసినది.

నాకు స్వప్నములో దర్శనము ప్రసాదించిన దేవతా పురుషుడు తమిళనాడు రాష్ట్రములో "అరుణాచలము" అను పుణ్యక్షేత్రమందు "శ్రీ రమణాశ్రమములో జీవించి, " భగవాన్ శ్రీ రమణ మహర్షి"గా ప్రఖ్యాతి పొంది, ఆయన తన 70 వ సంవత్సరములో అనగా ది॥ 14-04-1950న మహానిర్యాణము చెందినారు. ఆయనకు వ్యక్తి గతమైన జీవితము లేదు. "సత్యాత్మ" ప్రకాశమే ఆయన జీవితము. సమత్వము ఆయన ఊపిరి. ఆత్మ ఒక్కటే సమానమైనది. ఆయన దర్శన మాత్రము చేతనే ప్రపంచములో అనేకమంది జీవితములో కృతార్థులైనారు. భారతదేశపు ఆధ్యాత్మిక ఆకాశానికి ఆయన సూర్యుడి లాంటివారు. యావత్ మానవజాతికి ఒక వరముగా శ్రీ రమణ స్వామిని పరమేశ్వరుడు ప్రసాదించాడు. ఆయన జీవితమే ఆయన సందేశము. రమణస్వామి ఉపదేశములను దేశ కాలములు బంధించలేవు. ఆయన నామస్మరణ పుణ్య ప్రదమైనది. మహాత్ములకు మహాత్ముడు. ఆయన అవతారము మానవజాతికే గర్వకారణము. మానవజాతి తపఃఫలముగానే ఆయన అవతరించారు. ఆయన సందేశము జాతికి వెలుగు !

నేను 1959 వ సంవత్సరము జనవరి నెలలో మొదటిసారిగా తిరువణ్ణామలైలో నున్న రమణాశ్రమము దర్శించినాను. ఆనాటి నుండి నేటివరకు రమణ సందేశమును వ్యాప్తి చేయుటకు నా జీవితమునంతా అంకితము చేసినాను. నేను కావాలని ఆయనను నా జీవితములోనికి తెచ్చుకొనలేదు - ఆయనే నన్ను కావాలని తీసుకొని, జీవితములో నన్ను కృతార్థుడిని చేసినారు.

**- భూపతిరాజు వెంకటలక్ష్మీనరసింహరాజు**

**శ్రీ నాన్నగారు**

ఓం నమో భగవతే శ్రీరమణాయ

# దివ్యచైతన్యస్రవంతి

## 1

సద్గురు శ్రీ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ నాలుగు మాటలకి ముందు ఒక ముఖ్యమైన సూక్ష్మం గ్రహించటం అవసరం. తెలుగులో "చూడటం", "దర్శించటం" అని రెండు శబ్దాలు ఉన్నాయి. ఇవి సమానార్థకాలుగా కనిపించినా, రెండింటి మధ్యా భేదం ఉంది. ఒక స్నేహితుణ్ణి చూస్తాం, ఒక బంధువుని చూస్తాం. కాని ఒక మహాత్ముణ్ణి, ఒక సద్గురువుని "దర్శించాం" అంటాం. ఇక్కడ "చూసాం" అన్నా, ఆ మాట మన భావాలని సంతృప్తిగా వ్యక్తపరచలేదు. ఉదాహరణకి వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం వెళతాం. "దర్శనం" బాగా జరిగింది స్వామి దయవల్ల అంటాం. "చూడటం బాగా జరిగింది" అని అనం. చూడటానికి, దర్శనానికి నేత్రాలే మాధ్యమాలు. కాని రెండు "చూపుల" మధ్యా చాలా తేడా ఉంది.

హిందూ తత్వశాస్త్ర శాఖలని "దర్శనాలు" అంటారు. "షడ్ దర్శనాలు" అన్న పదం అందరికీ పరిచయమైనదే. ఈ దర్శనాలు సూచించే సత్యాలు నేత్రాలతో చూచేవికావు. అంతరంగ చైతన్యంలో కలిగే స్పందనల వల్ల వ్యక్తీకరణకి అందని అనుభవాలు ఇవి. భాషకి అందక, ఏ మాధ్యమాల ద్వారా వ్యక్తం చేయలేని అనుభవాలకే "దర్శనం" అంటాం. ఇది అపరోక్షానుభూతి. ఇంద్రియాల ఆధారం

కాదు. అన్ని ఇంద్రియాలకి ఆధారభూతంగా ఉన్న సద్వస్తువుని, దివ్య చైతన్యాన్ని దర్శించే సందర్భం ఇది. కలకండ స్థూలంగా కనిపిస్తుంది. దాని రుచిని "తియ్యగా" ఉంది అనగలం. కాని "తీపి" అంటే ఏమిటో శబ్దాలు చెప్పలేవు.

"ఇవన్నీ-ఇన్ని గొడవలు-మాకు దేనికి చెబుతున్నారు? మాకివి అవసరమా?" అని మీరు అడగచ్చు. "నాన్నగార్ని దర్శించాం అదీ ముఖ్యం. మరి దాన్ని గురించి చెప్పుకొనటం దేనికి?" అని మీరు కొంచెం విసుక్కోవచ్చు కూడా. కాని కొంతమందికి చెప్పుకోవాలని అనిపిస్తుంది. ఆ దర్శనానందాన్ని పంచుకోవాలనిపిస్తుంది. ఈ మధ్యనే నాన్నగారు నాతో మాట్లాడుతూ, "కొన్ని Secret burdens ఉంటాయి కొందరికి" అని అన్నారు. అంటే రహస్యంగా ఉండి వారిని వేధిస్తూ ఉండే బరువులు. అట్లాంటి బరువే నాకు. అది వారి దర్శనం కలిగించిన ఆనందలహరుల స్పందనలని పంచుకోవాలన్న బరువు గుప్తంగా ఉంది చాలారోజుల్నించి. మీ అందరితో పంచుకోవాలని బలంగా ఉంటుంది.

ఇంతకీ నాన్నగారి దర్శనం కేవలం ఒక సీదాసాదా చూడటమా? అది కాదని ఆయన మాటల్ని లలితమైన, మధురమైన ఆ మాటల్ని మంత్రముగ్ధంగా వింటున్న అసంఖ్యాకమైన వారి అభిమానుల్ని చూస్తే తెలుస్తుంది. స్పష్టంగా, ఏ సందేహం లేకుండా నిర్ధారించుకోవచ్చు. ఆయనలో ఏ మార్మికమైన ఆకర్షణ ఉన్నదని విప్పారించిన కలువల్లాంటి నేత్రాలతో, రెప్పవేయకుండా, భౌతికంగా ఎంత అసౌకర్యంగా ఉన్నా వారి శబ్దాలని శ్రవణం చేస్తారు? కాలం పరిధులు అంతగా అవలోకించకుండా వింటూ ఉంటారు? ఎన్ని

కళ్ళు ప్రేమతో, అభిమానంతో చూస్తున్న ఆయన నేత్రాల వంకనే చూస్తూ ఉంటాయో చూస్తే, ఇది మామూలు మాటల గారడి లేక శబ్ద చమత్కారం కాదు అని తెలుస్తుంది. ఇది దర్శనాల సూక్ష్మాలని అధిగమించిన "దర్శనం."

చాలాసార్లు నాకు అనిపిస్తూ ఉంటుంది. నాన్నగారు చెప్పేది నిజంగా వింటూ, మనసులో సాధ్యమైనంతగా పదిలపరచుకుని స్పందిస్తున్నామా అని. ఎందుకంటే ఒక దివ్యచైతన్య సన్నిధిలో ఉన్నపుడు మాటలు వింటున్నా, ఆ మాటల్ని మరిచిపోయినా, ఆ PRESENCE, ఆ సన్నిధి మన చైతన్యంలో నిలిచి, స్థిరంగా పునాదులు వేసుకుని, అవిభాజ్యమైన అనుభవంగా మన వ్యక్తిత్వంలో లయమవుతుంది. మృదువైన వారి మూర్తి, మృదువుగా వినిపించే శబ్దాలు, మిలమిలలాడే నేత్రాలు, శారీరకమైన భంగిమలు - మధ్య మధ్య విధిగా కనిపించే విలువైన నిశ్శబ్ద క్షణాలు ఇవన్నీ దర్శిస్తుంటే.. కలిగే ప్రభావాన్ని "దర్శనం" అన్న మాటకూడా వ్యక్తం చేయలేదేమో! అనిర్వచనీయమైన ఏదో స్పందన Vibration కి ఆనందంతో దాసులమవుతాం. ఇది మరొక విధంగా చెప్పాలంటే : గుండె గొంతుకలోన కొట్లాడుతాది" అన్న భావకవి మాటలు అక్కరకు వస్తాయి. ఇంగ్లీషులో షేక్స్పియర్ అన్నాడు "I cannot heave my heart into my mouth!" అని.

ఈ అనుభవం నాకూ కొద్దోగొప్పో కలిగింది. ప్రథమ దర్శనం చైతన్యంలో ఇప్పటికీ నిలిచింది. దాని ప్రభావం, పరమార్థం గురించి మీకు చెప్పాలన్నదే ఈ ప్రయత్నం.

ఈ సందర్భంగా నా గురించి కొన్ని వివరాలు చెప్పటం

అవసరం. మా తండ్రిగారు శ్రీరామకృష్ణ సంప్రదాయ అభిమానులు. వివేకానందస్వామి ప్రత్యక్ష శిష్యులైన విరజానందస్వామివారి వద్ద మంత్రదీక్ష పొందారు. నాన్నగారి ద్వారా నాకు, మా సోదరులిద్దరికీ ఈ అమూల్య వారసత్వం దక్కింది. భీమవరం మా ఊరు. (హైదరాబాదు వలస వచ్చా: ఇప్పటికీ ఆ ఊరే మా ఊరు. అది నాన్నగారి లీలాక్షేత్రమైన జిన్నూరుకి దగ్గరగా ఉండటం మా అదృష్టం!). బి.యే అప్పటి డబ్యు.జి.బి, ఇప్పటి డి.ఎన్.ఆర్ కాలేజీలో చదివా. అది చదువుతున్నపుడే తండ్రిగారు, శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక శిశువు అని ప్రసిద్ధులైన బ్రహ్మానందస్వామి శిష్యులైన యతీశ్వరానంద స్వామివారి దగ్గర నాకు మంత్రదీక్ష ఇప్పించారు. ఇది శారదామాత జన్మ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా రాజమండ్రిలో జరిగింది. (1953).

భీమవరంలో ఉన్న రోజుల్లో సద్గురు నాన్నగార్ని చూడలేదు. వారి గురించి వినలేదు. నా గొడవంతా ఆధ్యాత్మిక గ్రంథాల సేకరణ, సాధ్యమయినంత పఠనం – వీటితోనే గడిచిపోయింది. పాలకొల్లులో మా చుట్టాలు ఉన్నందువల్ల అక్కడికి వెళ్ళా. కాని దగ్గరగా ఉన్న జిన్నూరు కనలేదు, వినలేదు. జిన్నూరు నాన్నగారి గురించి నాకు తెలియదు. విన్నా ఏ ఒక్క విషయం స్మృతిలో లేదు. (అయితే ఇది నిర్ధారణగా చెప్పలేను).

రమణమహర్షి అన్నారు కదా: "ఏది ఎపుడు ఎక్కడ ఏవిధంగా జరగాలో అదే విధంగా తప్పకుండా జరిగి తీరుతుంది." బహుశ ఈ సత్యమే నాకు వర్తిస్తుంది. సద్గురువుల దర్శనం ఎపుడు జరగాలో అపుడే జరుగుతుంది, జరిగింది. ఏది జరగాలో అది శ్రేయస్కరంగా–

యేగక్షేమపరంగా జరిగి తీరుతుంది. దీనిని తార్కికంగా కూడా ఆలోచిస్తే: ఏవిధంగా వాస్తవంగా, యదార్థంగా జరుగుతుందో అదే వాస్తవం, నిజం. మిగతావన్నీ ("ముందరే దర్శనం జరిగితే బావుం డును") ఆలోచనలు, భావాలు. అందువల్ల నాన్నగారి దర్శనం ఏ క్షణాన జరిగిందో అదే ఉచితం, పరిపక్వం అయిన సమయం. అది సహజంగా కూడా జరిగింది.

నాన్నగారు హైదరాబాద్ రావటం గురించి నాకు తెలిసే అవకాశం ఉన్నా, నాకు తెలియలేదు చాలాకాలం. ఈ అవకాశం ఉంది అన్న వాస్తవానికి ఆధారం శాంతా సుబ్బారావు గారు. వీరితో ఉద్యోగరీత్యా నాకు పరిచయమే. కాని నాన్నగారి గురించి ఆమె నాకు చెప్పలేదు. ఎపుడూ సాధారణంగా సాధువుల గురించి ఆమె నాకు చెప్పటం జరిగేది. ఆ విధంగా యు.జి.కృష్ణమూర్తి గారి దర్శనానికి ఆమె తీసుకువెళ్ళారు. కాని నాన్నగారి ప్రస్తావన వచ్చినట్లు తోచదు. (అదే రోజుల్లో జిల్లెళ్ళమూడి అమ్మ గురించి శాంతగారే చెప్పారు. నా పుస్తకాల ఉన్మాదం గ్రహించి అమ్మ గురించిన కొన్ని పుస్తకాలు కూడా నాకు ఇచ్చారు.)

నాన్నగారితో పరిచయం అయి, ఎన్నోసార్లు దర్శనం చేసు కున్న తర్వాత నాకనిపించింది. వారిని ఎపుడు దర్శనం చేసుకోవాలో అపుడే జరిగింది. అంత క్రితం జరిగి ఉంటే? ఏమో, ఇపుడున్న కొద్దిపాటి అవగాహన కూడా ఆరోజుల్లో నాకు కలిగేది కాదేమో! ఈమధ్య ఒక ప్రసంగంలో నాన్నగారే అన్నారు: "ఏ విధంగా ఎపుడు ఎక్కడ జరగాలో అదే రీతిగా కచ్చితంగా జరిగి తీరుతుంది. ఈ ఆధ్యాత్మిక రంగంలో తొందర పనికిరాదు. అసహనం అనవసరం.

ఆ సమయం వస్తే, మన సంకల్పం, కోరికలతో నిమిత్తం లేకుండానే అన్నీ జరుగుతాయి." ఈ విషయంలో ఆలస్యం, సరైన సమయం అన్న భావజనితమైన ఆలోచనలకి తావే లేదు. గతం గురించి దిగులూ అక్కర్లేదు. భవిష్యత్తు గురించి అవలోకనాలు అవసరం లేదు. వర్తమానమే వాస్తవం. అందువల్ల గతం తలచుకొని విచార పడక్కర్లేదు. "గత కాలము మేలు వచ్చుకాలము కంటె" అని ఒక కవి భావుకతతో పద్యం అల్లాడు. కాని అది కవిత్వం, వాస్తవానికి పనికిరాదు.

ఇదంతా చెప్పటానికి బలమైన కారణం: ఆరోజుల్లోనే నాన్న గారి దర్శనం అయి ఉంటే దాని ప్రభావం ఉన్నా, ఆ ప్రభావం యొక్క అవగాహన, అది ఏవిధంగా ఈ మార్గంలో ఉపకరించేదో నాకు అర్థమయ్యేదికాదు. ఇపుడు చూచాయగా తెలుస్తోంది! (అసలు అనుభవించాలి తప్ప అర్థాలు వెతకటం దేనికి?)

# 2

> ఒక్కసారి మీరు గురువు యొక్క అనుగ్రహంలో పడితే మీ లోపల ఉన్న అజ్ఞానాన్ని శుభ్రంగా తొలగించే వరకూ గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. మనలో ఉన్న మాయను, అజ్ఞానాన్ని తొలగించి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. వాడు గురువు. - నాన్నగారు (రమణ భాస్కర, మే 2009, పే.14)

ఈ అనుభవ ఆధారమైన సత్యానికి అంకురార్పణ నాకు చిత్రంగా జరిగింది. అంటే నాన్నగారి ప్రథమ దర్శనం. మరింత విచిత్రమేమంటే: దీనితో మరొక ప్రఖ్యాతజ్ఞాని, శాస్త్రవేత్తకి సంబంధం ఉన్నది. నాన్నగారి ప్రథమ దర్శనం, భీమవరానికి దగ్గరగా ఉన్న చిన్న గ్రామంలో జన్మించిన జ్ఞానానందస్వామి వారి జన్మదిన శతాబ్ది ఉత్సవాలలో జరిగింది. జ్ఞానానందస్వామి వారిని Saint and Scientist అంటారు. వీరు శాస్త్రీయజ్ఞానానికి, ఆధ్యాత్మిక విజ్ఞానానికి సేతువులు నిర్మించిన ప్రఖ్యాత రుషిపుంగవులు.

చిత్రమేమిటంటే: జ్ఞానానందస్వామి దర్శనం నాకు అంతక్రితమే చాలా సంవత్సరాల ముందే జరిగింది. ఆ సమయంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో Nuclear Physics శాఖని

ప్రారంభించి, పటిష్టంచేసి, అంతర్జాతీయ ఖ్యాతిగల కేంద్రంగా తీర్చిదిద్దారు జ్ఞానానందస్వామి. మా తండ్రిగారితో వెళ్ళి వారి దర్శనం చేసుకున్నా విశాఖపట్టణంలో. కాని నాకు ఆ దర్శనం ఈ విధంగా పరిణమించి, నాన్నగారి ప్రథమ దర్శనానికి సేతువుగా ఉపయోగ పడుతుందన్న సత్యం నా ఊహలోకే రాలేదు. (స్నేహశీలి డా॥ అక్కిరాజు రమాపతిరావుగారి ధర్మమా అని "జ్ఞానదర్శిని" అన్న పత్రికలో జ్ఞానానందతత్త్వం గురించి కొన్ని వ్యాసాలు వ్రాసే అవకాశం కలిగింది. స్వామిజీ వ్రాసిన "పూర్ణసూత్రాలు" అన్న అమూల్య గ్రంథానికి పీఠిక వ్రాసే అదృష్టం కూడా నాకు కలగచేసారు ఈయన)

పద్మనాభరాజుగారు నన్ను జ్ఞానానందస్వామి జన్మశతాబ్ది ఉత్స వాలలో పాలుపంచుకొనమని ఆదరాభిమానాలతో పిలిచారు. ఆ విధంగా గొరగనమూడి గ్రామం వెళ్ళటం తటస్థించింది. అక్కడే నాన్నగారి దర్శనం. దీన్ని గురించి చెప్పేముందు భావనలో ఈ మహాత్ములు ఇద్దర్నీ ప్రక్కప్రక్కన ఉంచి ఆలోచిస్తే ఎంత అద్భుతమో, అవగాహనై మనసు ఆనందంతో ఉప్పొంగుతుంది! ఇద్దరూ జ్ఞానులే. ఒకరు ఆధ్యాత్మికజ్ఞానాన్ని ఔపోసనపట్టి, దాని ఆధారంగా శాస్త్ర జ్ఞానానికి మరింత మెరుగులు దిద్దారు. మరొకరు ఈ రెండింటి సారాన్ని గ్రహించి ఆర్ద్రత, భక్తి వీటితో రంగరించి తమదైన ఉపన్యాస ఉపదేశ ఫక్కీలో అసంఖ్యాకమైన అభిమానులలో భక్తి, జ్ఞాన, వైరాగ్యా లను సమన్వయంచేసి ఆధ్యాత్మిక ప్రగతిపథం వైపు అలవోకగా నడిపిస్తున్నారు.

జ్ఞానానందస్వామి వారి ఉత్సవాల సందర్భంగానే నాన్నగారు గొరగనమూడి వచ్చారు. మరి నేను కార్యక్రమం గురించి ఎందుకు

వాకబు చెయ్యలేదో ఇప్పటికీ అంతుపట్టదు. లేదంటే ఆ కార్యక్రమాల మొదటి రోజునే మధ్యాహ్నం నాన్నగారి ప్రసంగం ఉందని తెలిసేది. బహుశ మధ్యాహ్నం 3 గంటలకు అని జ్ఞాపకం. ఆ మొదటి సభలో నాన్నగారి ప్రసంగం. సభాప్రాంగణం అంతా స్వామివారి పూర్వ విద్యార్థులతోనూ, నాన్నగారి అభిమానులతోనూ నిండిపోయింది. సభా ప్రాంగణం అంతా కిటకిటలాడింది. ఇపుడు నాకు అనిపిస్తోంది: నాన్నగారి ప్రసంగాన్ని వినటానికి వచ్చినవాళ్ళే ఎక్కువ అనుకుంటా. వారు, వారి ప్రసంగమే ప్రత్యేకమైన ఆకర్షణ. ఎందరో స్త్రీలు, అన్ని వయసుల వాళ్ళూ శ్రోతలుగా వచ్చారు. వాళ్ళ కన్నులన్నీ నాన్నగారి పైననే.

నే పైనుంచి వచ్చిన అతిథిని కనుక నన్నుకూడా వేదికపైకి ఆహ్వానించారు. ఆ విధంగా నాన్నగారి సరసన కూర్చొనే అవకాశం కలిగింది. వేదికపైన ఏ కుర్చీలు లేవు. మెత్తగా ఉన్న పరుపులు పరిచిన, తెల్లటి వస్త్రాలతో కప్పిన ఆ వేదిక చూడముచ్చటగా ఉన్నది. నాన్నగారి ప్రక్కనే నేను కూర్చున్నా.

ఆ సభ, లాంఛనాల సంగతులు ఏమీ నాకు జ్ఞాపకం లేవు. పద్మనాభరాజుగారే బహుశా అందర్నీ ఆహ్వానించి ఉంటారు. కాని నాకు జ్ఞాపకం ఉన్న అంశం ఒకటి ఉంది: మా ఎదురుగా నేలపైన కూర్చున్న సభికుల్ని చూడగానే సంభ్రమాశ్చర్యాలు ముప్పిరిగొన్నాయి. ప్రత్యేకించి కొంతమందిని చూస్తే (కొంతమంది, దాదాపు అందరూ) ఎంత భక్తి, ఎంత శ్రద్ధ, ఎంత అమాయకత్వం కనిపించాయో చెప్పలేను. స్త్రీలందరూ వేదికకి చాలా దగ్గరగా, దాదాపు దానికి అంటుకుపోతున్నట్లు కూర్చున్నారు. ఇన్ని ఏళ్ళ తర్వాత కూడా వారి

ముఖకవళికలు మర్చిపోలేను. నాన్నగారి ప్రసంగం వినటానికి ఎంత ఉత్సుకత, ఎంత ఉత్సాహం ఉన్నవో చూస్తే, ఆ మహనీయులు ఏ విధంగా తమ ప్రేమతో, అభిమానంతో వారిని మంత్రముగ్ధుల్ని చేసారో అర్థమయింది. వారిలో ఒకరు సీదాసాదా చీరె, ముఖాన మామూలు కన్నా పెద్దబొట్టు, కళ్ళనిండా స్వచ్ఛత, ఆరాధన. నిజంగా ఆమె నాన్నగారి ప్రవచనాన్ని వినటానికి వచ్చిందని అనుకోను. కేవలం ఆ సద్గురువుని దర్శించి, దాని ద్వారా కలిగిన ఆనందప్రకంపనలని అంతరంగంలో నిలుపుకొనటానికే వచ్చిందని నాకు అర్థమైంది. కన్నార్పకుండా నాన్నగారు మాట్లాడినంతసేపూ అట్లా ముందుకు వంగి చూస్తూనే ఉన్నది.

ఆ క్షణాలలో ఇదే ఆధ్యాత్మికత యుగయుగాలుగా ఏ విధంగా, చైతన్యవంతంగా జీవిస్తున్నదో అర్థమయింది. ఇది భారతదేశపు మరొక సంస్కృతికి అద్దం పడుతుంది. ఇక్కడ చదువుతో సంబంధం లేదు. భాషా భేషజాల, పాండిత్య వెంపర్లాటల ప్రసక్తి లేనే లేదు. వీరందరికీ భక్తిశ్రద్ధలు సహజంగా, తరతరాలుగా వచ్చాయి. ఆ పరమ "అక్షర"సత్యగ్రహణకి షరతులేవీ లేవు. ఓనమాలు తెలియక పోయినా, ఓంకారం ఏమిటో అలవోకగా, అనుభూతిపరంగా గ్రహించగలిగిన మనుషులు వీళ్ళందరూ అనుకున్నా. మరి, ఇటువంటి వ్యక్తులు తగ్గిపోతున్నారే అన్న దిగులు కూడా కలిగింది. అక్షరాస్యత అడ్డుపడని ఈ సంస్కృతిని పోషించే నాన్నగారిలాంటి మహానుభావులు కూడా ఎందరో అనుకున్నా కాని మనసులో దిగులు అదేవిధంగా ఉంది.

ఎంతో కొంత చదువు సంధ్యా ఉంటేగాని ఆధ్యాత్మికతకి

సంబంధించిన అంశాలు అర్థంకావు అన్న అపోహ బాగా దెబ్బతింది. పైగా వీరిని "నాన్నగారు" అని అందరూ ఎందుకు పిలుస్తారో చూచాయగా అర్థమయింది. బహుశ: దీని వెనుక ఒక సంఘటన ఉండచ్చు. కాని అసలు మూలాలు ఉపనిషత్తుల సూక్ష్మతలోనే ఉన్నాయి. "త్వమేవ మాతా చ, పితా, త్వమేవ ..." అన్న స్తోత్రపాదం యుగాలుగా మన సంస్కృతిలో సజీవంగా, చైతన్యవంతంగా ఉన్నదే. ఇంతేకాదు "నాన్న" అనగానే మరింత సాన్నిహిత్యం, చనువు ధ్వనిస్తాయి. నాన్నగారితో అనుబంధం సహజమైనది, సరళమైనది, మృదువైనది. ఆ విధంగా కూడా "నాన్నగారు" ఒక ఒరవడి పెట్టారని పించింది. వేదికపై నుంచి కొంచెం చెయ్యి చాపితే వాళ్ళు అందు తారు. అంత సాన్నిహిత్యం, సామీప్యత నాన్నగారితో ఉండటం సహజం కదా!

మరి ప్రేమభక్తికి పరాకాష్ఠ తండ్రీ, శిశువుల అనుబంధమే. మానసికంగా, ఆధ్యాత్మికంగా మనందరం వారి శిశువులమే అన్న భావం స్థిరంగా నాటుకుంటే చాలు. అదే అన్ని సాధనల ఫలాన్ని అందచేస్తుంది. శారీరకంగా శిశువులుగా ఉండటం అసహజం, అప్రాకృతం. కాని అంతరంగ శిశువుని ఆవాహన చేయటమే ఆధ్యాత్మికతకి అనువైన సహజ సాధన ప్రక్రియ అని పెద్దలు అంటారు కదా! శిశువుకి ఆశ్చర్యగుణం అమితంగా ఉంటుంది. అ"మాయ" కత్వం మాయదారి మాయలో పట్టుపడకుండా అడ్డుపడుతుంది. ఒకవేళ పట్టుపడే ప్రమాదం ఉన్నా పట్టుకుని పైకెగరేసినా తండ్రి మనల్ని క్రిందపడనిస్తాడా?

భాషా సాహిత్యాల వెంపర్లాటలలో కొట్లాడుతున్న నాకు (వృత్తి

రీత్యా, (ప్రవృత్తి రీత్యాకాదు) నాన్నగారి భాష చల్లటి, మృదువైన పిల్లగాలిలా తట్టింది. స్ఫటికంలా పరమసత్యాన్ని వ్యక్తంచేసే ఆ శబ్దమాధుర్యం ఎంతగా ఆకట్టుకుందో, ఆ అనుభవం ఎంతగా చైతన్యంలో భాగమయిందో.. చెప్పటం కష్టమేకాదు. చెప్పనవసరం లేదు. అందరం అనుభవించే అద్భుతం - Miracle సాహిత్యం ఆలోచనామృతం, సంగీతం ఆపాతమధురం అంటారు. రెండూ పడుగూ పేకల్లా సమన్వయమయి, లయించి, ఒరుసుకుంటూ ప్రవహిస్తే! ఇక్కడ ఆలోచనలకి తావుందా? కలకండ తిన్న తర్వాత ఎవరేనా ఎట్లా ఉందని అడిగితే, మనం ఎంత వివరణ చేసినా వ్యర్థం. నోట్లో ఒక ముక్క పడేసి తిన్న తర్వాత "ఇపుడు చెప్పు ఆ రుచి ఏమిటో? అని అడగాలి. ఆ కంఠంలో మధురిమలు వర్ణనకి అందనివి.

సాధారణంగా ఆధ్యాత్మిక ఉపన్యాసాలంటే అనుభవం ఎక్కువ నింపుకుని, అక్షరాడంబరం తక్కువగా ఉండాలి. కాని ప్రస్తుత పరిస్థితి దీనికి సరిగ్గా వికృతి. ఎన్ని పుస్తకాలని ఉటంకిస్తే అంత ఆధ్యాత్మికత, అంత అర్థగాంభీర్యం అన్న భ్రమ ఈ రంగంలో మోతాదు మించి ఉంటుంది. ఇది విమర్శ అనుకుని చెప్పలేదు. వాస్తవం అని చెప్పా. పైగా సీదా సాదా విషయాలని క్లిష్టంచేసి చెప్పటం ఉపాధ్యాయుల వృత్తి. "నాకు అర్థమయింది సర్! ఇక ఒదిలెయ్యండి నన్ను!" అని విద్యార్థి - వేడుకున్నా, "నేను చెప్పకముందే నీకు ఎట్లా అర్థమవ్వాలి! అసంభవం!" అని కోప్పడి ఆ విద్యార్థిని కూర్చోపెట్టే తత్వం.

అటువంటి నేపథ్యంనుంచి శ్రీరామకృష్ణులు నన్ను చాలా మటుకు కాపాడారు. ఇపుడు "నాన్నగారు" ఆ సూక్ష్మం ఏమిటో

క్రమేణా చిన్న, చిన్న మోతాదుల్లో తెలుపుతున్నారు అని తోస్తుంది. సున్నితంగా, సూటిగా చెప్పాలంటే ఒక మహాత్ముడు మనల్ని ప్రభావితం చేసారంటే ఒక అద్భుతం ఉంటుంది. తమ ప్రభావం అక్షరాల మాధ్యమం ద్వారా కాక తమ PRESENCE వ్యక్తిత్వం యొక్క అనిర్వచనీయమైన శక్తి ద్వారా మనలో అంతర్గతంగా ఉన్న ఆధ్యాత్మికతని, దాని గుణాలని వెలికితీస్తారు. Not by Words but by Presence!

# 3

మర్నాడు కూడా జ్ఞానానందస్వామి శతాబ్ది ఉత్సవాలు కొనసాగాయి. సభాస్థలం డి.ఎన్.ఆర్. కాలేజీ ఆవరణలో ఉన్న శ్రీరామకృష్ణ సభాభవనం. ఈ సభాభవన నిర్మాణ సంకల్పానికి మా నాన్నగారు కూడా ఒక కారణం. మిత్రులతో కూడి ఈ భవన నిర్మాణ ఆలోచనకి రూపం ఇచ్చారు ఆయన. అప్పటికే ఎందరో రామకృష్ణమఠ స్వాములు భీమవరానికి రావటం జరిగింది. అంటే ఆ పట్టణంలో అప్పటికే ఆధ్యాత్మిక వాతావరణం చాలా బాగా నెలకొని ఉన్నదన్న మాట. ఈ వాతావరణంలో నాన్నగారి పాత్ర ఎంత ప్రముఖమైనదో చెప్పక్కర్లేదు. కాని ఏ సంస్థ యొక్క నేపథ్యం లేకుండా, వారు ఒక్కరే, ఒంటరిగా ఈ వాతావరణానికి మరింత ప్రగతి కలిగించారనటం చారిత్రకంగా ఒక ముఖ్యమైన అంశం. ఇది అందరం నిశితంగా విశ్లేషించుకోవలసిన అవసరం ఉంది.

రెండవరోజు సభలో నేను కూడా ఒక వక్తని. కారణం ఏమిటో తెలియదు కాని గొరగనమూడి నుంచి సభాభవనానికి చేరటం కొద్దిగా ఆలస్యమయింది. సభ అప్పటికే ప్రారంభం అయింది. నాన్నగారి పక్కన, అప్పటి రాజమండ్రి రామకృష్ణమఠ అధ్యక్షులైన స్వాత్మానంద స్వామిజీ ఉన్నారు. మరొక తమాషా జరిగింది.

నాన్నగారి కన్నా ముందే నేను మాట్లాడవలసి వచ్చింది. తర్వాత నాన్నగారు. క్రితం రోజు అనుభవించిన నాన్నగారి ప్రభావం ఇంకా ఉందేమో! నా ఉపన్యాసం నాన్నగారి గురించి ప్రస్తావించటంతో ప్రారంభం చేసా! వారి ప్రవచనాల సొగసు, సౌందర్యం ఎంత అద్భుతమో చెప్పా. ఆ తర్వాతనే జ్ఞానానందస్వామి గురించి చెప్ప దలచుకున్నది చెప్పా. ఈయన స్వామి, నాన్నగారు "గృహస్థు". ఆ తేడా వల్ల కొన్ని అంశాలు తడతాయి. పైగా జ్ఞానానందులు జ్ఞానానందులే. మరి నాన్నగారో? నీరజదళంపై నీటిబొట్టులా ఉన్న జ్ఞాని. సంసారుల వెంపర్లాటలు, సమస్యలు, ఆధ్యాత్మిక జీవితం కోసం వాళ్ళు చేయవలసిన సాధన యొక్క పరిమితులు, ఇబ్బందులు నాన్నగారికి తెలుసు. వాటిపట్ల సహనం ఉంది. దిగులుతో కూడిన ఆర్ద్రత ఉంది. అన్నిటినీ మించి అన్ని సూక్ష్మాలని అర్థమయ్యేరీతిలో వ్యక్తం చేయగలిగిన అపూర్వమైన ప్రజ్ఞ ఉంది. సంసారం సహజ జీవనంలో అనుభవించే అనురాగాలతో పాటు అపస్వరాలని అవ గాహనతో వాటిని ఏ విధంగా సమతౌల్యంగా, సరసంగా బ్యాలెన్స్ చేయాలో వ్యక్తం చేసే నిశితమైన పరిశీలన కూడా ఉంది. ఒక ఉదాహరణ చూడండి: "మీ బిడ్డలు మంచివారు అయ్యి ఉండవచ్చు. మీకు ఇంటినిండా సంపద ఉండవచ్చు. కాని మీరు దేనితోటి తాదాత్మ్యం పొందవద్దు." లౌకికంగా మంచివి అని వాటిని చెపు తూనే, వాటితో అతుక్కుపోకండి అని చెప్పటం ఒక సూక్ష్మమైన ప్రక్రియ. సంపద, బిడ్డలు మంచివే. కాని అటాచ్‌మెంట్ మోతాదు మించకుండా డిటాచ్‌మెంట్ అవసరం. ఇందులో సూత్రం: ప్రకృతిలో వికృతి లేదు.

ఈ మధ్య ఒక వివాహ సందర్భంలో ఒక తమాషా గమనించా. వధూవరులు ఒకరికొకరు కనపడకుండా ఉంచే "తెర" పైన వ్రాసారు: (పైన) "తెరవెనుక అందం" అని ఉంది. మధ్యలో ఏదో చిత్రం (క్రింద) "తెరతీస్తే బంధం" అని ఉంది. ఇదే జ్ఞాన సూత్రం. ఒక విధంగా అందాలు, బంధాలు ఆధ్యాత్మిక జీవితంలో బొమ్మా, బొరుసు. నాన్నగారు ఈ ధోరణిలోనే ఆ విధంగా సున్నితంగా, సుతారంగా సుపథాన్ని సూచిస్తారు. విమర్శకి తావివ్వకుండా వివేకాన్ని ప్రజ్వలింపచేయటం ఇది వారి సూక్ష్మం.

ఇదే విషయం ఆ సభలో నాన్నగారు మాట్లాడిన తర్వాత విశదమయింది. నాన్నగారి ప్రసంగం అవగానే దాదాపు సగంమంది వెళ్ళిపోయారు! ఇంకా వక్తలు ఉన్నారు! మరి నాన్నగారిని వినటానికే ఆ సగంమంది వచ్చారన్నమాట! సభాపరంగా కొంత ఇబ్బంది అయినా, ఒక సంగతి గ్రహించా. ఒకసారి వారే అన్నారు. "కేవలం ప్రేమ మాత్రమే అందరం ఒకటే అన్న భావాన్ని సృష్టిస్తుంది." ఈ సూత్రమే అక్కడ రుజువైంది. ఇది మిగతా వ్యక్తులపైన ఒక విమర్శ కాదు. ఒక సత్యం సూచించటం: నిజాయితీతో, అధికారికంగా, అనుభవం ప్రాతిపదికగా ఉండి, దైనందిన సందర్భాలలోనే దాగి ఉన్న ఆధ్యాత్మిక అంశాలను వెలికితీయటం ఇదీ నాన్నగారి ప్రసంగాల అపూర్వత. రామతీర్థస్వామి అనేవారు The art of religion consists in making every little bit of expenience an occasion for a leap into the Infinite మనకి కలిగిన ప్రతీ చిన్న అనుభవం, అనుభవశకలం ఆసరాగా తీసుకుని ఆ పరమాత్మ హృదిలోకి గెంతటమే ఆధ్యాత్మిక కళ అంటే.

అంచేత ఇది లౌకికం, అది పారలౌకికం అని తేడా లేనే లేదు. ఏదైనా ఒకే చైతన్యశక్తి. దాన్ని సరైన మార్గంలో మళ్ళిస్తే విముక్తి; అపమార్గంలో ప్రవహిస్తే బంధం! "అమృతవాహిని"లో ఈ బిందువు రుచి చూడండి: నాన్నగారు అంటారు: " 'నేచురల్ స్టేట్'లో ఉండాలంటే నేను ఉన్నాను అనే స్థితిలో ఉండాలి. స్త్రీని అనిగాని, పురుషుడను అనిగాని, పదవిలో ఉన్నాను అనిగాని, హోదాలో ఉన్నాను అనిగాని తాదాత్మ్యం చెందకుండా ఉండాలి. మంత్రుల దగ్గర ఉన్న పోలీసులు మంత్రులు చెప్పినట్లు ఉంటారు. ఆ పోలీసులే దొంగల దగ్గర ఉంటే వారిని తమ అదుపులో ఉంచు కుంటారు. అలాగే ఆత్మ తెలిసిన వారికి వారి మనస్సు అదుపులో ఉంటుంది. తెలియనివారు మనసు పరిధిలోనే అసహాయంగా జీవి తాన్ని వెళ్ళబుచ్చుతారు".

మంత్రులు, పోలీసులు, ఆత్మ, మనస్సు నాలుగూ సహకరిస్తేనే, వాటి మధ్య పొంతన ఉంటేనే, శాంతిమయజీవనం. జటిలమైన ఈ అంశాన్ని మనందరికీ సహజంగా పరిచయం ఉన్న ఉదాహరణల ద్వారా విశ్లేషించటం ఒక అపూర్వత. నాన్నగారిది ఈ పంథా. ఇది సుపరిచితమైన పంథా. ఉదాహరణకి తిరగలి తిప్పుతూనే మహారాష్ట్ర స్త్రీలు విఠల్ దేవునికి పాటలు పాడేవారు. కీర్తనలు ఆలపించేవారు. ఆ పాటలన్నీ భక్తిని తిరగలికి సంబంధించిన అంశాలతో పోల్చి అంతరంగ జీవన సూత్రాలని విప్పి చెప్పేవి.

# 4

భీమవరంలో ఆ దర్శనం తర్వాత నేను నాన్నగార్ని కలవలేదు. తర్వాత ఒక్కసారే (1985 ప్రాంతాలలో) వారిని ఒక సత్సంగంలో దూరం నుంచి దర్శించా. కాని నాన్నగారితో సత్సంబంధం "రమణ భాస్కర" ద్వారా స్థిరంగానే ఉంది. అవి రెగ్యులర్‌గా ప్రతీనెలా వచ్చేవి. (కొంతకాలం అది పక్షపత్రిక అని గుర్తు) ఈసారి దర్శనం శాంతా సుబ్బారావుగారి ద్వారానే సాధ్యమయింది. ఒక రోజు ఫోన్ చేసి చెప్పారు: "నాన్నగారు హైదరాబాద్ వచ్చారు. మధురానగర్‌లో వారి ప్రసంగం ఉంటుంది. వీలయితే వెళ్ళండి!" అని చెప్పి అన్ని వివరాలూ ఇచ్చారు.

దాని ప్రకారం మధురానగర్‌లో ఆ ప్రదేశం కనుక్కున్నా. నేను వెళ్ళేసరికి నాన్నగారి ప్రవచనం అప్పటికే మొదలయింది. అది ఒక హాలులా ఉంది. ఒక చిన్న కాలువ ప్రక్క ఇల్లు. హాలంతా నిండి పోయింది. నేను ఇంటికి ఆనుకునే ఉన్న ఒక చిన్న అరుగుమీద కూర్చుని నాన్నగారి "ప్రసాదం" ఆరగించా. కాని వస్తుత: చాలా బిడియం నాకు. చొరవగా వెళ్ళి ఏ స్వతంత్రం తీసుకోలేను. ఈ విషయంలోనూ అంతే. అందువల్ల నాన్నగారికి దూరం నుంచే నమస్కరించి, ప్రవచనం అవగానే తిరిగి వచ్చేసా. నాన్నగార్ని దగ్గరకు

వెళ్ళి పలకరించే ధైర్యం కలగలేదు. కాని దర్శనం అయితే జరిగింది. స్మృతి ఆరలేదు. తేజోవంతంగా ఉంటూనే వచ్చింది. ఈ సమావేశం దానిని మరికొంచెం ప్రజ్వలింపచేసింది.

ఈ సమయంలోనే నాన్నగారికి రమణ భగవాన్‌కి ఉన్న అనుబంధం సంగతి తెలిసింది. కర్ణాకర్ణిగా విన్నా కాని, వివరాలు నాకు తెలియవు. అప్పటికే హైదరాబాద్ రమణకేంద్రంతో నాకు పరిచయమయింది. ప్రతీ ఆదివారం వెళ్ళటం అలవాటయింది. మరి అది నా అదృష్టమే అని చాలాసార్లు అనుకుంటా: ఆ కేంద్రం కూతవేటు దూరంలో ఉంది మా ఇంటికి. అందువల్ల అక్కడకు వెళ్ళటం పెద్ద కష్టమేమీ కాదు. అయితే భగవాన్‌కి నాన్నగారికి ఉన్న అనుబంధం సంగతి నాకు తెలిసిన తర్వాత కూడా, అది ఏలాంటిదో నాకు అవగతమవలేదు. "సరే! సరైన సమయంలోనే అది తెలుస్తుంది" అని సమాధానపడ్డా. ఇప్పటి వరకు పునరాలోచన చేసుకుంటే: నాన్నగారితో పరిచయం ప్రత్యక్షదర్శనంతో మొదలైంది. కాని వారి వ్యక్తిత్వంలో కీలకాంశాలు అజ్ఞాతంగానే ఉండిపోయాయి. వారి భాషని, భావాలని అర్థం చేసుకోగలిగా. కాని వాటి సూక్ష్మాలు, అవి విడమరిచి చెప్పిన వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక ప్రతిభ, ప్రజ్ఞ గురించి పెద్దగా తెలియలేదు. "మహాత్ములు" అని సరిపెట్టుకున్నా. కాని కొంతైనా సాన్నిహిత్యం ఉంటే గాని అర్థంకాని విషయాలు ఉన్నాయి. ఈ సంగతి మాత్రం గ్రహించా.

మరొక అనూహ్యం, ఆశ్చర్యకరం అయిన అంశం నాకు కనిపించింది. వృత్తిరీత్యా, ప్రవృత్తిరీత్యా నేను "శబ్దాల వ్యాపారిని" Word merchant. అందమైన భాష అంటే మక్కువ ఎక్కువ.

అయితే శబ్దచమత్కారాలలో దాగి ఉండే జీవనసూత్రాలు నాకు బహిర్గతం అవలేదేమో! పైగా, దైనందిన జీవితంలోనే ఆధ్యాత్మికత మతలబులు, సూత్రాలు విలీనమయి, చైతన్యాన్ని పరిపుష్టంచేసి వ్యక్తిత్వంలో బలమైన శక్తి నింపాలి అన్న అంశం నాకు అంతగా తట్టలేదు. అంటే నిత్యజీవితానికి, ఆధ్యాత్మిక, నైతిక విలువలకి విడదీయలేని సాన్నిహిత్యం ఉందన్న వాస్తవం నాకు తెలుసు. కాని అది అనుష్ఠానంలో సత్యం అయేవి అన్న అంశం? అది అంతగా నాటుకోలేదేమో! దీనికి ఒక కారణం నాన్నగారి ప్రవచనాల ద్వారా గమనించా. అంతకు మునుపు శ్రీరామకృష్ణుల ఉపదేశ వైఖరిలో ఇది చూసా, ఆనందించా, క్రమేణా దానిని జీవితానికి అన్వయం చేయటంలో కొన్ని అడుగులు వేయటానికి ప్రయత్నించా.

అయితే ఒక సమస్య: మనసు లౌకికాన్ని, ఆధ్యాత్మికాన్ని విడదీసి తీర్థానికి తీర్థం, ప్రసాదానికి ప్రసాదం అన్న విభజన తత్వం పైన ఆధారపడి సంఘంలో జీవించటం అలవాటు చేస్తుంది. పూజ గదిలో పూజచేస్తూనే, ఆ గదినుంచి బయటకురాగానే పూజగదిలో ఉన్న ప్రశాంతత అక్కడే ఉండిపోతుంది. ఆ పూజ సృష్టించిన ప్రశాంతత, స్థిరత్వం బాహ్యజీవితంలో కనిపించవు. "ఆఫీసుకి ఆలస్యమవుతోంది ఇంకా వంట కాలేదేం?" అని చిందులు తొక్కటం. ఆఫీసుకి వెళ్ళి అక్కడి వాళ్ళతో వ్యవహారం ఏమాత్రం దీనికి తీసిపోదు. అక్కడా విసుగే, కోపమే, అసహనమే. ఇంతేకాదు మన పైవాళ్ళకి వినయం నటిస్తూ వ్యవహరిస్తాం. క్రిందవాళ్ళని కించపరుస్తూ ఉంటాం. అయినా "ఇందుగలడందులేడని..." "సర్వం ఖల్విదం బ్రహ్మ" అని చెపుతూనే ఉంటాం.

దీనిని ఎంత సరళంగా, సహజంగా నాన్నగారు వివరిస్తారో మచ్చుకి ఒక పేరా "గుడిలో శివునికి అభిషేకం చెయ్యటంలో ఎంత ప్రశాంతంగా నిర్మలంగా ఉంటావో అలాగే నీ విధి నిర్వహణలో నీ కర్మలను చూచి నిర్మలంగా జీవించు. చిరాకుగా, పరాకుగా చెయ్యకుండా ఇష్టంతో చెయ్యి. కర్మని యోగంగా చెయ్యి. కోరలు తీసిన పాము ఏమీ చెయ్యలేదు. నిష్కామకర్మ మానవుణ్ణి బంధించదు. అది చిన్నపని అయినా మనలను పవిత్రుణ్ణి చేస్తుంది." (అమృత వాహిని "నిష్కామకర్మ" పే. 1.75) ఇవి అందరికీ పరిచయం ఉన్న సందర్భాలు, అందరి జీవితంలో పెనవేసుకున్న ఉద్వేగాలు. భాషతో బాధలేదు. ఏ ఒక్క మాటకీ ఎవర్నీ అర్థం అర్థించక్కర్లేదు. అర్థమవుతుంది. కాని.. ఈ 'కాని' దగ్గరే చిక్కు.

ప్రశాంతత, నిర్మలత గుడిలో. చిరాకు పరాకు విధినిర్వహణలో. ఇష్టం లేదు కర్మంటే. కామ్యకర్మంటే ఇష్టమే. కాని ఈ కామ్యకర్మ బంధిస్తుంది. ప్రమాదకారి. ఎంత ప్రమాదమో తెలుసా? కోరలు తియ్యని పాము, విషంతో నిండిన పాము. ఇటువంటి ఉదాహరణ కనుక మనసులో నాటుకుంటే, ఆ మనోచిత్రమే చైతన్యంలో నిలిస్తే, కామ్యకర్మని చెయ్యటం మనంతట మనం, కచ్చితంగా విషపూరితమైన పాము కోరల్లో చెయ్యిపెట్టి కరిపించుకొనటమే! నాన్నగారే అన్నారు: "పాము కరుస్తుందని చెబితే పామును చూడగానే మనకు ఆ మాటలు గుర్తుకు వస్తాయి. అదే విధముగా నేను చెప్పే మాటల విలువ ఈ రోజున కాకపోయినా ఏదో ఒకరోజున ఏదో ఒక జన్మలో మీకు తప్పక గుర్తుకు వస్తాయి." (అమృతవాక్కులు, పే. 14)

పాము నోట్లో చెయ్యి పెడతావా? అని అంటే "పెడతాను"

అని అనగలమా? కాని ఎంత అనాయాసంగా ఈ ఉదాహరణ అర్థమవుతుందో అంత సునాయాసంగానూ దాని ఆచరణలో ప్రక్కకి పెట్టేస్తాం.

మరో ఉదాహరణ: చాలా తమాషా అయిన ఉదాహరణ, వింటే ఎంతో వినోదం కలిగించేది. "బ్యాంకు మేనేజరు ఆ బ్యాంకులో ఒకరికి అప్పు ఇచ్చిన తరువాత వాడు కట్టలేకపోతే బెంగపెట్టుకోడు. కారణం ఆ "అప్పుకు" పెట్టిన తాకట్టు ఆస్థి ఉంది. అది బ్యాంకు చూచుకుంటుంది అని ఆందోళనపడడు. కాని అతను ఇంటికి వచ్చి తన స్వంతసొమ్ము ఎవరికైనా నోటు మీద ఇస్తే అతను ఇయ్యకపోతే బెంగపెట్టుకుంటాడు. బ్యాంకులో ఆస్థిపోతే స్థితప్రజ్ఞుడిలా గుణా తీతుడిగా ఉంటాడు. సొమ్ము 'నాది-నేను ఇచ్చాను' అనే భావన బాధ కలుగజేస్తుంది."

"డబ్బుకి లోకం దాసోహం" అని ఒక సినిమా ఉంది. అది సత్యం. బ్యాంకులో ఉద్యోగం అంటే అందరికీ అంతో ఇంతో అభిమానమే. డబ్బు బాగా వచ్చే, ఇతరుల డబ్బుతో మరింత డబ్బు సృష్టించి, మన డబ్బు మనం తీసుకొనటానికి కౌంటర్ల దగ్గర ఎంతో సేపు నిలబెట్టిన తర్వాతకాని ఇవ్వని అద్భుత మాయాజాలం బ్యాంకు లాంటి ఆర్థిక సంస్థలు. ప్రలోభాలు ఎక్కువ. కనుకనే నిష్కామం మరింత అవసరం. మరి అక్కడ స్థితప్రజ్ఞత! నిజంగానే: ఎందుకంటే స్థిరంగా, సమగ్రంగా తాకట్టుపెట్టే ఆస్థి పత్రాల్ని పరీక్ష చేసిన తర్వాతనే Loan grant చెయ్యాలి కదా! ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదమే తన ఆస్తి తుడుచుకుపోతుంది. తాకట్టుపెట్టేది ఈ స్థిత ప్రజ్ఞతతో పరిశీలించటం వల్లనే, ఇచ్చిన ఋణాన్ని అది ప్రమాదం

నుంచి కాపాడుతుంది. ఇక్కడ కస్సుబుస్సులు పనికిరావు. కేంద్రీకృతం అయిన మనస్సుతో అన్నీ పరిశీలించిన తర్వాత కాని అప్పు ఇవ్వడు మేనేజరు. ఒకవేళ ఆ అప్పు తీరక పోయినా, బెంగ దేనికి? అవసరం లేదు. బ్యాంకు చూచుకుంటుంది. మరి తను "స్వంత" డబ్బుతో ఇచ్చిన రుణం తిరిగి రాకపోతే? భరించలేని బెంగ. ఎట్లా రాబట్టాలని వెంపర్లాట. "అసలు" తిరిగి వస్తుందా రాదా అని మానసిక ఒత్తిడి. Stress and tension.

"నా" డబ్బు అనగానే బెంగ. స్థితప్రజ్ఞత ఏమయింది? "హుష్ కాకి" అయింది. కాని తన డబ్బు దగ్గర కూడా అది అవసరం, మరింత అవసరం. ఎందుకంటే ఎల్లలు దాటిన బెంగ అనారోగ్యానికి నాంది. అంటే స్థితప్రజ్ఞత అన్నది ప్రకృతి సహజంగా మనకి (అడక్కుండానే అన్నీ అమర్చి ఆనందంగా ఉండమని చెప్పే అమ్మే) ఇచ్చిన సంపద. అది ఒక ప్రబలమైన మానసిక శక్తి. అది ఏవిధంగా ఉపయోగించు కోవాలో తెలిస్తే చాలు. "ఉపయోగం"లోనే "యోగం" అన్నమాట ఉందికదా! మరి నాన్నగారు ఈ ఉదాహరణనే తీసుకుని యోగప్రక్రియ వైపు మళ్ళించే శక్తి అని స్పష్టంచేసి ఇక ఆ దారమ్మట నడవటం మన వంతు అని తేలుస్తారు. అందుకే నాన్నగారు చక్కగా, చిక్కగా అన్నారు: "పని అంటే ఒకటే పని. అది ఆధ్యాత్మికంగా ఆత్మానుభవానికి పనికివచ్చే పని."

# 5

నాన్నగారి పరిచయం దృఢమవటంలో మరొక మలుపు "అమృతవాహిని" ప్రతి కోసం నేను ప్రయత్నించటం. నాన్నగారి ప్రసంగాలు ఒక పుస్తకరూపంలో వచ్చాయని వినగానే నాకు బెంగ మొదలైంది. అది సంపాదించాలన్న ఆదుర్దాకి శ్రీకారం చుట్టబడింది. ఎవర్ని అడగాలి? పెద్ద ప్రశ్న. ఇంకా ప్రతులు ఉన్నాయా లేవా? అని మరింత బెంగ కలిగించిన పెనుప్రశ్న. "రమణభాస్కర"లో ఉన్న నంబర్లకి ఫోన్ చేసా. కాని స్పష్టత రాలేదు. పాలకొల్లు నుంచి ఎవరో మాట్లాడారు. ఏది ఏమైనా ఎక్కడ దొరుకుతుందో తెలియ లేదు.

కాని ఇదే సమయంలో రమణకేంద్రంలో మిత్రులయిన తాడి మేటి సత్యనారాయణగారు తరచు కలిసేవారు. ఒకటి, రెండుసార్లు నాన్నగారి ప్రస్తావన వచ్చింది. ఒక సందర్భంలో ఫోన్ చేసి సత్య నారాయణగారు "మీరు 'అమృతవాహిని' ఇంగ్లీషులోకి అనువాదం చేస్తే బావుంటుందండీ! అని ఆ ఆలోచనకి అంకురార్పణ చేసారు. "మీరు చేస్తేనే బావుంటుంది" అని రెట్టించారు. సత్యనారాయణగారు స్వయంగా చక్కటి అనువాదకులు. రమణ భగవాన్ పైన వారు వ్రాసిన చిన్న పుస్తకం నన్నెంతగానో ఆకర్షించింది. చక్కటి, సరళమైన

తెలుగు వ్రాయగలరు. నన్ను నాన్నగారి పుస్తకం అనువాదం చెయ్య మనటానికి వారి అభిమానమే కారణం. అయితే ఇది అంతటితో ఆగలేదు.

ఒకరోజు నాన్నగారికి సన్నిహితులయిన కె.ఎస్.ఎన్.రాజుగారు ఫోన్ చేసారు. తిరిగి అనువాద ప్రస్తావన వచ్చింది. అనువాదం గురించి మాట్లాడి, "మీకు 'అమృతవాహిని' ప్రతిని పంపుతా. చూడండి. అనువాదం మొదలుపెట్టండి" అన్నారు. రాజుగారు నాపట్ల చూపిన అభిమానానికి నాకు చాలా ఆనందం కలిగింది. ఆయన చాలా స్నేహశీలి. తిరువన్నామలైలో ఉన్నపుడు, వి.గణేశన్ గారు వ్రాసిన ఒక చక్కటి పుస్తకం గురించి రాజుగార్ని అడిగా. వెంటనే వాకబు చేసి రెండు మూడు రోజుల వ్యవధిలోనే ఆ పుస్తకం సంపాదించి నాకు పంపారు. కాని వారిని ప్రత్యక్షంగా అప్పటివరకూ కలవలేదు.

అనువాదం గురించి నేను కొంచెం అటూ ఇటూ ఊగిసలాడు తున్న సమయంలో "నాన్నగారు హైదరాబాదు వచ్చారు. ఒకసారి కలవగలరా?" అని నాకు ఫోన్ చేసారు (రాజుగారే అని గుర్తు), నాన్నగారిని దర్శించటం చాలా ఏళ్ళ తర్వాత నాకు ఆనందమే. కాని అనువాదం గురించి ఏమి చెయ్యాలి, ఏమి చెప్పాలి? నిగ్రహించ గలనా? సరే! కె.ఎస్.ఎన్.రాజుగారు నాన్నగారు ఉన్న చోటు గురించి విశదంగా చెప్పారు. ఎట్లా రావాలో స్పష్టంగా చెప్పినా, నాకు అయోమయం అయింది. సరిగ్గా వినలేదనుకుంటా.

ఈలోగా మిత్రులు రామ్‌ప్రసాద్ గారు "నేను తీసుకువెళతా రండి!" అని హామీ ఇచ్చారు. ఈయన అమెరికాలో ఒక సాఫ్ట్‌వేర్

కంపెనీని నడుపుతున్నారు. నాకు బాగా సన్నిహితులు. నన్ను కలవ టానికి వస్తానని చెప్పారు. అదే రోజు నేను నాన్నగార్ని దర్శించవలసి ఉంది. ఈ సంగతి చెప్పగానే "నేనూ అటే వెళ్ళాలి. రండి వెళ్దాం" అన్నారు. నాకు జ్ఞాపకం ఉన్నంతమటుకు ఎట్లా వెళ్ళాలో చెప్పా. కాని "గుడు గుడు గుంచం" అయింది. ఎక్కడా ఆచూకే దొరకలేదు. ఏ ఇంట్లోనూ నాన్నగారు ఉండగా కనిపించే వాతావరణం కనిపించ లేదు. ఎంతమందిని అడిగినా వాళ్ళు తెలియదనే అన్నారు. తిరిగి వెళ్ళిపోదాం అనుకుని వచ్చిన దారమ్మటే రామ్‌ప్రసాద్ గారు కారు తిప్పారు. అది ఒకింత నిర్జనంగా ఉన్న రోడ్డు. మనసంతా దిగులుగా ఉంది. ఎందుకు సరిగా ఎడ్రసు వ్రాసుకోలేదు అని నన్ను నేనే తిట్టుకున్నా. "అంత నిర్లక్ష్యమా" అని కూడా అనుకున్న క్షణాలు. ఆ నిర్మానుష్యంగా ఉన్న రోడ్‌లో ఒక స్త్రీ మెల్లగా నడుచుకుంటూ వెళుతున్నారు. నాగరికంగా, మర్యాదస్తురాలిగా కనిపించారు. పైగా గోదావరి జిల్లాలలో వ్యక్తుల ఛాయలు కనిపించాయి. సరే రామ్ ప్రసాద్‌గార్ని ఒక్కక్షణం ఆపమని కారు దిగి, ఆమెని అడిగా. "నాన్న గారు అని జిన్నూరు నుంచి వచ్చారు. ఎక్కడ ఉంటారో మీకేమైన తెలుసా?" అని అడిగా. ఆశ్చర్యపోయారు ఆమె "ఇపుడే నాన్నగారి ప్రవచనం విని వస్తున్నా. వారు ఎవరికోసమో వెయిట్ చేస్తున్నారు. ఈ పక్కనే ఇల్లు!" అన్నారు. అప్పటికీ మేము వస్తామన్న సమయం దాటిపోయింది. వెంటనే కారు మళ్ళించి ఆమె చెప్పిన ఆనవాళ్ల ప్రకారం నాన్నగారు ఉన్న ఇంటికి చేరాం!

ఇదంతా ఇంత విశదంగా చెప్పాలా? చెప్పాలి. ఎందుకంటే "అమృతవాహిని" అనువాదం నాకు అప్పగించాలని నాన్నగారి

సంకల్పం. నేనా సందిగ్ధంలో ఉన్నా. ఆ పని అంగీకరించాలా వద్దా అని. ఇల్లు దొరకలేదు. (ఆక్షణంలో అనువాదం గురించి మరిచే పోయా!) మరి ఒక మహాత్ముని సంకల్పానికి తిరుగున్నదా? అది తీరాల్సిందే. అది ముందే నిర్ణయమైన అంశం. అది రూపొందా ల్సిందే. అందుకే ఇక ఇంటిదారి పడదాం అని అనుకున్న క్షణాలలో మేము వెళుతున్న దారిలోనే ఆమె కనిపించటం, ఆమె నాన్నగారి అభిమాని అవటం, విసుగు పక్కన పెట్టి నేను ఆమెని అడగటం! ఒకదాని వెంట ఒకటి జరిగి నాన్నగారి దర్శనం అవటం! నా అంతరాంతరాళాల్లో జంకు, సందేహం వగైరా భావాలు ఉన్నా, ఇది అనువాద కార్యం తప్పకుండా జరగవలసి ఉన్నది అన్న సూచన అని గ్రహించా.

ఎన్నో సంవత్సరాల తర్వాత నాన్నగారి దర్శనం, బాగా సన్నిహితంగా. ఎందరో భక్తులు, అభిమానులు కూర్చున్న ఒక హాలు దాటి, నాన్నగారు ఉన్న చిన్న గదిలోకి వెళ్ళా. ఎదురుగా మంచంపైన నాన్నగారు. నన్ను ప్రథమంగా ఆకట్టుకున్నది వారి నేత్రాలు. ప్రేమాభి మానాలతో, ఆంతర్య, బహిరమైన స్వచ్ఛతతో అవి మిలమిల లాడుతూ ఉన్నాయి. స్వచ్ఛమైన తెల్లటి వస్త్రాలు ధరించారు. క్లుప్తంగా చెప్పాలంటే పవిత్రత, ప్రేమల యొక్క అపురూప, అపూర్వమైన ఆధ్యాత్మికత రూపొందిన మూర్తి. ఇపుడనిపిస్తోంది వారి దర్శనం గురించి సరిగ్గా చెప్పాలంటే: రమణ భగవాన్ "నీ సహజ స్థితిలో ఉండు" అని చెప్పిన సత్యానికి అది నిలువెత్తు ధృవీకరణ. పైగా ఆ గదిలోనే రమణ భగవాన్ ఛాయాచిత్రం ఉంది. రమణుల నయ నాలు, ఆయన అందమైన శరీరం మొత్తంలో ఇట్టే ఆకర్షించి, ఆపి,

తన గురించి ఇక మరుపు లేకుండా చేసే మాంత్రికమైన అంశాలు. నాన్నగారి నయనాలు కూడా అంతే. నయనదీక్ష అలవోకగా ఇచ్చే నేత్రాలు. ఇటువంటి ప్రభావం నేను మరి ఇద్దరిలో చూచా. నా మంత్ర గురువులు యతీశ్వరానంద స్వామి, నా శిక్షాగురువులు శ్రీరామ్‌గారు!

"మీ సౌకర్యంబట్టి చెయ్యండి, కంగారు లేదు. ఏదైనా ఆనందంతో చేయాలి. అపుడే అది సరైన రూపం ధరిస్తుంది" అన్నారు నాన్నగారు. అనువాదం గురించి అదలా ఉంచండి. క్రిందటి సంవత్సరం 18 సెప్టెంబర్ (2008) గురువారం నాడు నాన్నగారు రమణకేంద్రానికి వచ్చారు. మధ్యాహ్నం దాదాపు $3\frac{1}{2}$ గంటలసేపు మాట్లాడారు. అప్పటి కొన్ని అనుభవాలని, తర్వాత, ఈవిధంగా వ్రాసా: "కేంద్ర ఆవరణలో నాన్నగారు అడుగుపెడతారనగానే అభిమానుల్లో కలకలం మొదలయింది. కేంద్రం గేటు దగ్గర, కేంద్ర నిర్వాహకులు వారికి స్వాగతం పలికారు. అక్కడ ఉన్న అందర్నీ పలకరించారు! ఏవిధంగా? కొందరిని స్పర్శించారు. ఆప్యాయతతో కొందరి ముఖాన్ని రెండు చేతులతోనూ కొన్ని నిమిషాలపాటు నిమిరారు. కొందరి వంక చూసారు. ప్రవచనం హాలులోకి ప్రవేశించగానే దాదాపు 5 నిమిషాలు సమీపంగా ఉన్నవారిని చూస్తూ నిలుచున్నారు. ప్రసంగం సమయంలో కూడా మధ్య మధ్య మాటలు ఆపి చూపులు ప్రసరిస్తారు. నిశ్శబ్దం తాండవమాడుతుంది."

ఆ విధంగా నాన్నగారిని దర్శించా. మరి మరిన్ని సంగతులు చెప్పటానికి ఉన్నాయి. పదండి ముందుకు..

# 6

రమణ కేంద్ర ప్రవచనంలో మరొక సంగతి గ్రహించా. లోగడ అది అదృష్టంగా ఉంది. ఇపుడు స్పష్టమైంది. అది నాన్నగారి హాస్య ప్రియత్వం. ఎన్నో తమాషా సామెతలు అలవోకగా ఆయన ప్రసంగంలో ప్రవహిస్తాయి. ఒక వాక్యం నా మనసుకి ఎంతో వినోదం కలిగించింది. "అన్నీ తెలిసినవాడు అమావాస్యనాడు పోతే ఏమీ తెలియని వాడు ఏకాదశినాడు పోయాడు." వినగానే నవ్వకుండా ఉండలేకపోయాం శ్రోతలందరం. సాధారణంగా ఆధ్యాత్మిక ప్రసంగాలు ఒకరకమైన నిద్రమాత్రలుగా పనిచేసి, కనీసం కొంతమందినయినా జోకొట్టి, నిద్రలోకి జారుస్తాయి. నాన్నగారితో ఆ గొడవలేదు. ఎంత గంభీరమైన అంశాలు ఉంటాయో, భాష అంత సరళంగాను ఉంటుంది. అర్థం చేసుకొనటానికి ప్రయత్నం చెయ్యక్కర్లేదు. అనాయాసంగా అర్థం అంతర్నేత్రం ముందు ఉంటుంది, అలరిస్తుంది.

నిద్ర గురించి చెప్పా. మరి నాన్నగారు ఏమంటారో చూడండి: "మీకు కోట్లాది రూపాయలు ఉన్నాయి అనుకోండి. మీకు అధికారం ఉంది అనుకోండి. ఇంటిచుట్టూ పది చిన్నకార్లు, నౌకర్లు ఉన్నారు అనుకోండి. మీకు అన్ని భోగాలు ఉన్నాయి అనుకోండి. ఇవన్నీ కలిసి నిద్రలో పొందే సుఖాన్ని నీకు ఇస్తున్నాయా అని వేదం అడిగింది.

ఇన్ని భోగాలు ఉన్నవాడు కూడా ఒక్క రాత్రి నిద్ర పట్టకపోతే నాకు నిద్ర పట్టలేదు అని డాక్టరు దగ్గరకు పరుగెడుతున్నాడు".

ఈ అంశాన్ని ఏవిధంగా ఉన్నతమైన అంతరంగ ఎత్తులకు తీసుకెళతారో చూడండి "నీకు ఉన్న సర్వసంపదలు కలిసి నిద్రలో ఉన్న సుఖాన్ని నీకు ఇవ్వలేకబోతున్నాయి కాబట్టి నాకు రాత్రి నిద్ర లేదు, నిద్రలేదు అని గోలపెడుతున్నావు. ఆ సుఖం అట్టిది. నిద్రలో ఉన్న సుఖమే ఇంత అద్భుతంగా ఉంటే ఇక ఆత్మసుఖం ఎంత వైభవంగా ఉంటుంది. అది వర్ణనాతీతం." (రమణభాస్కర; మార్చి 2009, పే. 12)

నిద్రతో మొదలయి ఉపనిషత్ సారాంశం అయిన జాగ్రత్, స్వప్న, సుషుప్తుల ఎత్తుకు తీసుకెళ్ళి, ఈ మూడింటిని అధిగమించిన ఆత్మసుఖంతో ముడిపెట్టటం! ఇదీ చతురత్వం, చమత్కారం. నవ్వుతూనే మనకి మృదువుగా "వాతలు" పెట్టటం. ఒక్కొక్కసారి ఆపరేషన్ ముందు "ఎనస్థీషియా" (మత్తుమందు) ఇచ్చినట్లు ఉంటుంది. ఆ మత్తు ఒదలగానే అసలు దుఃఖం మన జీవితాల్లో మనమే గృహ పరిశ్రమలాగా తయారుచేసుకునే సంగతిని సూచించటం. ఇదంతా అనాయాసంగా, గ్రహించేలా చెప్పటం. ఇది ఒక కళ, అతి ముఖ్యమైన కళ: జీవనకళ. కళలని ఆస్వాదిస్తారు కాని జీవనకళ నిర్వహణలో నిటారుగా పడిపోతాం నేలపైకి!

గహనమైన అంశాలను ఎంతో తేలికగా, భాష విషయంలో ఏ అంశంలోనూ తేలిపోకుండా, శ్రోతల చైతన్యంలో స్పందన కలిగించే కళ అరుదు. ఒకొక్కసారి "Who am I?" అన్న రమణ భగవానుల ప్రశ్నకి ఇచ్చే మలుపు సంసారాన్ని, నిర్వాణాన్ని కలుపు

తుంది. ఇహపరాలని జవిలిగా నమిలి మింగుతుంది. కాని విన టానికి సౌలభ్యం ఉన్నది, ఇట్టే విస్మరించటానికి కూడా సులభమవు తుంది! easily understood, effortlessly forgotten! దీనివల్ల దిగులు పడక్కర్లేదు. ఎందుకంటే ఆ చెప్పటంలో ఒక సాధా రణ, దైనందిన అంశం చోటు చేసుకుంటే అది మరిచిపోదామన్నా మరువలేము. నాన్నగారు హాస్యాన్ని మేళవించి ఎంతో ముఖ్యమైన అంశాన్ని అనాయాసంగా అర్థం అయ్యేటట్లు చెప్పారో చూడండి: "అజ్ఞానికి శరీరం 'నేను' అనే స్ఫురణ వస్తుంది. కాని జ్ఞానికి 'చైత న్యమే నేను' అని స్ఫురిస్తూ ఉంటుంది. అటువంటివారు 'మరణాన్ని' మజ్జిగ అన్నంలో పచ్చడి నంజుకుని తిన్నట్లు ఆనందంగా భుజిస్తారు. అలాగే జ్ఞాని కూడా మరణ విషయంలో ఉంటారు. జ్ఞాని యొక్క తలంపు, చూపు, ప్రతీ చేష్ట మనలను పవిత్రుల్ని చేస్తుంది." (అమృత వాహిని, పే 13) మరి నాన్నగారు మనల్ని "చూడటం" కూడా ఇంతేకదా! ఇదే ప్రయోజనాన్ని కలిగిస్తుంది కదా!

అవును. కాని ఒక షరతు: మన చక్షువుల్ని మూసికొని ఉండ కూడదు. ఇంట్లో తలుపులన్నీ బంధించి కూర్చుంటే భగవంతుడు "సరే తెరచి ఉన్నపుడే లోపలికి వెళదాం!" అని వెళ్ళిపోతాడేమో. రమణ భగవాన్‌ని "నాకు దైవదర్శనం ఇవ్వండి!" అని అంటే వారు "నువ్వు పుచ్చుకోగలవా?" అని అడిగారు. ఇవ్వటానికి ఇచ్ఛ, సంసిద్ధత ఉన్నా పుచ్చుకొనటానికి పరిపక్వత ఉండాలి. గట్టి జీర్ణశక్తి ఉండాలి. స్థిరంగా నిలుపుకునే సంస్కారాలు ఉండాలి. "భగవంతుడి కృప అన్న గాలి వీస్తూనే ఉంటుంది. కాని నీ తెరచాప ఎత్తి నైపుణ్యంతో

ఆ గాలిని ప్రయాణం వైపు మళ్ళించుకోవాలి కదా!" అన్నారు పరమహంస.

మూడు రకాల వైద్యులు అన్నారు పరమహంస. ఒకరకం వాళ్ళు రోగిని పరీక్షిస్తారు. మందు ఇస్తారు. ఫీజు పుచ్చుకుంటారు. అంతే. మరో రకం: "ఇంకా తగ్గలేదా? మందు సరిగానే వేసుకుంటు న్నారా? లేదా? సరైన వేళల్లో మందులు వేసుకోకపోతే జబ్బు ఎట్లా నయమవుతుంది?" అని మృదువుగా మందలిస్తారు. ఊరుకుంటారు. మరి మూడో రకం: "మందు వేసుకోవటం లేదా? ఇదేం తమాషా అనుకున్నారా? నోరుపట్టు, నేనే వేస్తా!" అని నోరు పగలదీసి మందు వేసి పంపుతారు ఈ మూడోరకం వాళ్ళే ఉత్తమ వైద్యులు అంటారు శ్రీరామకృష్ణులు. గురువులు కూడా ఇంతే. మూడోరకం గురువు రమణ భగవాన్.

భగవాన్ నాన్నగారి జీవితంలో ఎట్లా ప్రవేశించారో చదివిన తర్వాత రెండు విషయాలు నాకు అవగాహనకు వచ్చాయనిపించింది. "తెరచాపని కూడా ఆయనే తెరిచి పడవని నడిపించగలడు" అని మొదటిది. నాన్నగారు అంటారు "నేను కావాలని ఆయనను నా జీవితములోనికి తెచ్చుకొనలేదు. ఆయనే నన్ను కావాలని తీసుకుని జీవితములో నన్ను కృతార్థుడిని చేసినారు." ఇదే తమాషా. "ఆయనే మనల్ని కావాలని" అనుకొనటం ఆధ్యాత్మిక రంగంలో చాలా అరుదు. బహుశః ఆ రంగంలో ప్రకృతి నిర్దేశించిన ఒక ప్రబలమైన ప్రయోజనం కోసం అటువంటి వ్యక్తులను ఎన్నుకుంటుంది. ఆ ప్రయోజనం ఏమిటో నాన్నగారితో కొంచెమైనా పరిచయం ఉన్న వాళ్ళకి తెలుసు. స్వప్నదర్శనంలో రమణ భగవాన్ ఎంత బలంగా

నాన్నగారిని "పట్టుకొన్నారో" నాన్నగారే చెప్పినది చదివినపుడు రెండో విషయం అర్థమైంది. "నాన్నగారి పట్టుకూడా ఆ రకమే" అన్న విషయం.

ఎవరు ఆవిధంగా తమని పట్టుకొని ఒదలలేదో, ఎవరు "బల వంతముగా ఎత్తుకుని ఎంతో ఆప్యాయముగా మూడుసార్లు ముద్దు పెట్టుకున్నారో" నాన్నగారికి తర్వాత తర్వాత కాని తెలియలేదు. ఇది స్వప్నంలో అనుభవం. నిజానికి ఇది స్వప్నం కాదు. మనం ఉండే ప్రపంచమే స్వప్నం అని తెలియచెప్పే స్వప్నం. ఫోటో చూసి నపుడు కాని ఆయన ఎవరో తెలియదు. ఫోటొగ్రాఫ్ అన్న పదానికి మౌలికమైన అర్థం Writing with light అని. కాంతి వంతమైనదే కాక, దివ్యకాంతితోనే "వ్రాయటం". రమణ భగవాన్ ఉజ్వలమైన తమ దివ్యకాంతిని నాన్నగారిపైన ప్రసరించటం, దానితోపాటు అది అంతరంగంలో ప్రవేశింప చేయటం అన్నీ అద్భుతమైన అంశాలు. (దీనికి సామ్యంగా ఒక చిన్న అనుభవం నాకు ఉన్నది. రమణులు భౌతికకాయం ఒదిలిన తర్వాత, భాసా సుబ్బారావు గారి సంపాద కత్వంలో మద్రాసునుంచి వెలువడే "స్వతంత్ర" అన్న ఇంగ్లీషు వార పత్రిక ముఖచిత్రం భగవాన్‌ది. అది ఈనాటికీ, ప్రత్యేకించి ఆయన నయనాలు, మనసులో నిలిచిపోయాయి). "రమణ స్వామి ఉప దేశములను దేశకాలములు బంధించలేవు" అన్నారు నాన్నగారు. మరి ఈ కోవకే చెందినవి వీరి ఉపదేశాలు అంటే అతిశయోక్తి కాదు కదా! "నా హృదయములో పవిత్రత ఉంటే మీరు మరచిపోవా లనుకున్నా, నా మాటలు మిమ్మల్ని వెన్నంటి తరుముతాయి" అన్నారు వారే. (అమృతవాక్కులు పే. 12)

నాన్నగారి గురించి మాట్లాడుకుంటున్నపుడు వారి గాఢాభిమానులైన లక్ష్మిగారు (నిమిషకవి పేర్రాజుగారి అమ్మాయి) అన్నారు "నాన్నగారు మన వంక చూడటం వెనుక పరమార్థం మన మానసిక క్షేత్రాన్ని అన్ని ఎగుడుదిగుళ్ల నుంచి సంస్కరించటమే. అది ఒక psychic purification process" అన్నారు. ఇంతేకాదు నాన్నగారి ఆధ్యాత్మిక ప్రవచనాల ప్రయోజనం గురించి మాట్లాడుతూ "నాన్నగారి పేరు లక్ష్మీనరసింహరాజుగారు కదా! నరసింహస్వామి ప్రహ్లాదుణ్ణి రక్షించినట్లే నాన్నగారు మనందరి సమస్య అయిన 'అహంకారం' అన్న రాక్షసుణ్ణి మనలో తిష్టవేసుకుని కూర్చుని వధించి, సంస్కరిస్తారు" అన్నారు లక్ష్మిగారు.

మరి నాన్నగారు ఈ భావాన్ని ఏ విధంగా వ్యక్తం చేసారో చూడండి. "మోక్షము అంటే విడుదల. దేనినుంచి విడుదల? అజ్ఞానము నుంచి విడుదల. ఏది అజ్ఞానము? అహంకారమే అజ్ఞానము. ఏది అహంకారము! "దేహమాత్రుణ్ణి నేను" అన్న భావనే అహంకారము." ఈ అహంభావం మనందరిలో ఉంది. మోతాదు తేడా. దీన్ని సున్నితంగా అవగాహన కలిగించి తొలగించటమే నాన్నగారు చేసేది. అవగాహన దేన్నిగురించి? ఏరకమైన పాండిత్య భేషజాలు లేకుండా నాన్నగారు అంటారు "మోక్షం అంటే ఒక వస్తువు కాదు. మన హృదయములో ప్రకాశిస్తున్న వెలుగే మోక్షము. మనస్సును, మాటను, చేతలను, శరీరాన్ని సక్రమముగా, సరళముగా, సహజముగా ఉపయోగించుకున్న మానవుడే బంధము నుంచి విడుదల అవుతాడు." (అమృత వాక్కులు పే. 51)

ఇదంతా విన్న తర్వాత నాకు ఒక సందేహం కలిగింది. అది ఏమిటంటే...

# 7

నాన్నగారు ఏది చెప్పినా, చేసినా అది అలంకారప్రాయంగా ఉండదు. ఆలోచన ప్రేరేపించి, ఆచరణకి దారి తీస్తుంది. దారి తియ్యాలి. అపుడే ఆ ఆలోచనకి మోక్షం. ప్రసంగాలు విన్న తర్వాత నాకు ఒక సందేహం కలిగింది. నాన్నగారు ఎవరికేనా మంత్రదీక్ష initiation ఇస్తారా? అని. గురువులు సాధారణంగా మంత్రదీక్ష ఇస్తూ ఉంటారు. ఒకళ్ళిద్దర్ని అడిగా "నాన్నగారు మంత్రదీక్ష ఇవ్వటం సంగతి మేము వినలేదు ఇంతవరకూ" అన్నారు వాళ్ళు. సద్గురువులు శిష్యులకి మంత్రదీక్ష ఇస్తారుకదా! మరి నాన్నగారు ఇవ్వరా?

దీనికి సమాధానం నాకు తమాషాగా వచ్చింది. ఒకసారి వారిని చూడటానికి సంజీవరెడ్డినగర్ వెళ్ళా. మనసులో ఈ "ఉపదేశం" సంగతి మెదులుతూనే ఉంది. ఇంతలో ఒక అభిమాని వారి అను మతితో లోపలికి వచ్చారు. వారికి నమస్కరించి, చేతిలో కొన్ని పళ్ళు ఉంచారు. పెద్దగా వయసు ఉన్న వ్యక్తికాదు. నాన్నగారు యోగక్షేమాలు అడిగారు. అయిన తర్వాత ఆ వ్యక్తి "నాకు ఉపదేశం మంత్రదీక్ష ఇవ్వండి!" అని అడిగారు. నాన్నగారు ఒక్కక్షణం ఆగి చిరునవ్వు నవ్వారు. నవ్వుతూ "మీ ఇష్టదైవం ఎవరు?" అని అడి గారు. ఆ వ్యక్తి చెప్పారు. వెంటనే ఆ దివ్యనామానికి మొదట "ఓం"

చేర్చి, చివర "నమః" అని చేర్చి ఆ వ్యక్తికి చెప్పి తిరిగి చెప్పమన్నారు. అదే జరిగింది. "ఇదే మీకు మంత్రం" అని చెప్పి, మరేమీ ఏరకమైన సూచనలూ చెప్పలేదు, ఇవ్వలేదు. మంత్రదీక్ష జరిగింది.

ఇదంతా గమనించిన నాకు అనూహ్యమైన ఆశ్చర్యం కలిగింది. "పెద్దగా ఏమీ నియమాలు అవసరంలేదు. ఉదయం, సాయంత్రం మీకు వీలయినపుడు ఉచ్చరించండి" అన్నారు నాన్నగారు. నాకు ఆశ్చర్యం కలిగింది. ఎందుకంటే నాన్నగారు ఇచ్చిన మంత్రదైవం మనం రోజూ వింటున్న పవిత్రనామమే ఓం ఒకప్రక్క నమః ఇంకోప్రక్క చేర్చారు నాన్నగారు. ఇందులో ఏమీ రహస్యం లేదు. ఏ షరతులు లేవు. ఒక జపమాల ఉపయోగించండి మొదలైన సలహాలు ఏమీ లేవు. మరి ఆ వ్యక్తి ఉపదేశం చేయమని అడిగినపుడు ఆ వ్యక్తిని ఒకింత గమనించా. నాన్నగారి పట్ల శ్రద్ధా, భక్తి ప్రస్ఫుటంగా ఉన్నాయి. దీక్ష అడిగిన తీరులో వినయం, వ్యాకులత కలిపించాయి. మరి మంత్రదీక్ష లాంఛనంగా ఇవ్వాలంటే చాలా అంశాలు ఉంటాయి. అవేవీ అవసరం లేదనిపించాయి. అంటే అటువంటి సంప్రదాయాన్ని నిరసించటం, విమర్శించటం కాదు. వాటి అవసరం వాటికి ఉంటుంది. కాని నాన్నగారి పద్ధతి భిన్నంగా ఉంటుంది. **"వారి ప్రసంగమే ఉపదేశం, ప్రతీమాటా మంత్రమే.** మననం ద్వారా చైతన్యాన్ని వినీలింపజేసే మూలమంత్రమే" అన్నది వీరి ఒరవడి అనిపిస్తుంది. (నేను ఇదంతా గమనించా! అసలు మంత్రం ఇచ్చే టప్పుడు ఇతరులు ఎవరూ ఉండకూడదు కదా!) మరొకసారి రమణకేంద్రం దగ్గర కూడా ఇటువంటి సన్నివేశం చూసా.

ఈ నేపథ్యంలోనే నాన్నగారి "అమృతవాహిని" ఇంగ్లీషు

అనువాదం జరిగింది. అనువాదానికి అంగీకరించిన తర్వాత కొన్ని సూక్ష్మాలు తెలిసాయి. నాన్నగారి ప్రసంగాలని టేప్ చేయగా తిరిగి ఆ పుస్తక రూపంలోకి తెచ్చినవి. అంటే వ్రాయటం అన్న ప్రక్రియ ద్వారా వచ్చిన పుస్తకం కాదది. అది విన్నవాటి సేకరణ. తర్వాత పుస్తకరూపం పొందినవి. ఇక్కడే మరొక అపూర్వత కనిపించింది నాకు. సంప్రదాయకంగా మన సనాతనమైన మతగ్రంథాలన్నీ ఓరల్‌గా వచ్చినవి. అంటే వాక్కు ప్రధానమైన మాధ్యమం. వ్రాత కాదు. ఆ సనాతన సంప్రదాయానికి వారసత్వం ఉన్నవి నాన్నగారి ప్రసంగాలు అనిపిస్తుంది. మరి మాట్లాడితే కలిగే అనుభవం అచ్చయి మనముందుకు వచ్చిన అక్షరాలకి సామ్యమా? నాన్నగారి ప్రసంగాలని శ్రవణం చేసినపుడు ఆ కంఠంలో ధ్వనించే నిజాయితీ, అధికారికత, పదాల ఉచ్చారణ, మధ్య మధ్య తరచుగా వినిపించే నిశ్శబ్దం... ఇవన్నీ పుస్తకంలో రావుకదా! తరచు ప్రసంగం మధ్యలో నాన్నగారు మాటలు ఆపి శ్రోతల్ని గమనిస్తూ ఉండిపోతారు. నిశ్శబ్దం తాండవిస్తుంది. ఎందుకు ఈ మౌనం? మధ్య మధ్య! ఆ క్షణాలే అతి విలువైనవి అని విన్నవాళ్ళు గ్రహిస్తారో, గ్రహించరో తెలియదు. కాని మాటలు అణిగితేగాని మార్మికమైన అంశాల సూక్ష్మాలు మాటల పరిధిదాటి చైతన్యంలో స్థిరపడవేమో!

అందువల్ల ఇంగ్లీషులోకి అనువాదం చేయటం ఒక ఎత్తు, నేర్చుకుని ఆచరించటం మరొకటి. ఈ ప్రక్రియ జరిగేటపుడు ఒక్కొక్కచోట తరచు కలిగిన అనుభవం "ఎంత అందంగా ఉంది ఈ భావం!" అని. తెలుగుభాషని ఇంత సొగసుగా, మాండలికాల మతలబులు లేకుండా మాట్లాడటం చాలా అరుదు. అదే ఒక అద్భుతం అనిపించేది. శబ్దాల ధ్వనులు, వాటి వెనుక అర్థాలు వేరే

భాషలో కచ్చితంగా రావు. అనువాదం చాలాసార్లు "వివాదమే". నాన్నగారి పుస్తక ప్రచురణ జరిగిన తర్వాత కొందరు మిత్రులు కొంచెం ఇబ్బంది పడి నాకు చెప్పారు. ఇది నాకు తెలిసిన విషయమే. అది అట్లా ఉంచితే వైయక్తికమైన లాభం కలిగింది నాకు. నన్ను చికాకుపెట్టే కొన్ని సంశయాలకి సమాధానాలు దొరికాయనిపించింది. ప్రత్యేకించి ఆధ్యాత్మిక ప్రసంగాలు ఏ క్లిష్టతా లేకుండా ఆనందం కలిగిస్తూ చెప్పటం, ఆనందింపచేసి అధ్యయనం చేయించటం, అన్వయం చేసుకొనటానికి స్పందన కలిగించటం నాన్నగారికి తెలిసి నట్లు చాలా తక్కువ మందికి తెలుసు అనిపిస్తుంది. సాధారణంగా గంటదాటితే వినే ఓర్పు ఉండటం కష్టం. మరి నాన్నగారు రెండు గంటలు, ఒకొక్కసారి మరింత సమయం తీసుకుని మాట్లాడినా, శ్రోతల్లో ఏ రకమైన అసహనం మచ్చుకైనా కనిపించదు. ఇది అక్షరసత్యం. ఇంతసేపు విని, చెప్పినవన్నీ ఆకళింపు చేసుకున్నారా అని అడగచ్చు. కొంతమంది వినటం లేదేమో?

కాని అన్యమనస్కంగా ఉన్నా నాన్నగారి PRESENCE (సన్నిధి) తన పని తాను చేస్తుంది. ఒక ప్రవచనంలో వారే అన్నారు. "నీ తలంపులను నీవు గెంటి వేయనక్కరలేదు. సత్యంవైపు నీవు వెళితే లేనివి బయటకిపోతాయి. నిప్పు దగ్గరకు వెళ్ళేకొలది వేడి తగులుతుంది. అలాగే నీ సత్యసాధనలో నీ ప్రయత్నం లేకుండానే తలంపులు పోతాయి." అంటే నాన్నగారి మాటలు వినగానే మిగతా తలపులు ఎన్నో మన మనసుల్లో ఉంటాయి కాని అవి displace అవుతాయి. వాటికి స్థానచలనం! (అమృతవాహిని, పే. 246) దీనివల్ల శ్రవణం ఫలించి "నేను ఆయన వాడినే" (పే. 247) అన్న స్థిరత్వం కలుగుతుంది. (ఆయన = నాన్నగారు కదా!)

# 8

"అమృతవాహిని" జాగ్రత్తగా చదవండి. ఒక సంగతి తెలుస్తుంది. మేధావులు, శాస్త్రవేత్తలు, జ్ఞానులు, మహాత్ములు వీరి ఆలోచనలపట్ల, వారి వారి రచనలతోనూ నాన్నగారికి అపారమైన పరిచయం ఉంది. వారిని తమ "అవసరాలకి" ఏ విధంగా అన్వయం చేసుకొనాలో ఆ విషయంలో అపారమైన ప్రజ్ఞ కనిపిస్తుంది. ఇతరుల రచనలని చాలామంది చదువుతారు. కాని తమ చైతన్యస్థితులకి అనుగుణంగా వారిని తమదైన బాణీలో లయం చేసుకొనటం చాలా మందికి తెలియదు. Quote చేస్తారు పాండిత్యం మనముందు పరచటానికి. నాన్నగారు అట్లాకాదు. ఎవర్ని, ఏ పుస్తకాన్ని ఉటంకించినా, అది ఒక సహాయక వాయిద్యంలా ఉపయోగిస్తుంది. నాన్నగారి ప్రధాన ప్రసంగం యొక్క శ్రుతులకి, గీతాలకి, రాగాలకి అవరోధం కలిగించదు. వాటి పరిధుల్ని దాటనివ్వదు కాని తమ ప్రజ్ఞ, ప్రతిభలతో వాటిని చిన్నపరచి చూపరు.

చాలా ఉదాహరణలు కనిపిస్తాయి. ఒక సందర్భంలో ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్‌ని quote చేస్తారు. "భగవంతుణ్ణి హృదయపూర్వకంగా ప్రేమించటమే మతం. మతాల సారాంశం అంతా ఒక్కటే నీ హృదయంలో ఉన్న సత్యాన్ని దర్శింపచేసుకొనటమే. సైన్సు

అంటే విజ్ఞానం, మతం అంటే విధానం," అని చెపుతూ ఐన్‌స్టీన్‌ని quote చేసారు. "మతంతో సంబంధంలేని విధానం కుంటిది. సైన్సుతో సంబంధంలేని మతం గుడ్డిది" ("అమృతవాహిని" పే. 63)

మతాన్ని "విధానం" అని వర్ణించటం చాలా ఆలోచనలు, అంతరంగ సూక్ష్మాలు సూచించే వర్ణన. మరి నాన్నగారు ఉటంకించి నవి ఎన్నో ఉన్నాయి. కాళిదాసు రఘువంశం, బుద్ధుడి ప్రవచనాలు, గాథలు, రామకృష్ణుల ఉపదేశాలు ఎన్నో, ఎందరో మహానుభావుల సృజనాత్మకతని, ఆధ్యాత్మిక సూక్ష్మాలని అంతర్లీనంగా ఉన్న "అమృతవాణి" ప్రవహింపచేస్తారు నాన్నగారు. నాన్నగారిని దర్శించి నప్పుడల్లా నా ధోరణిలో నేను చదివిన పుస్తకాల గురించి చెప్పేవాణ్ణి. వెంటనే నాన్నగారు ఆ పుస్తకాలతో తమ పరిచయం గురించి మాట్లాడ తారు. ఒక ఉదాహరణ కంచి పరమాచార్యుల వారి సంపూర్ణ గ్రంథా వళి. ఈ ఆచార్యులంటే నాన్నగారికి అమిత గౌరవం.

ఇటువంటి సందర్భాలలోనే మతసంస్థలు, సంఘసేవ, ఆధ్యాత్మిక ప్రగతి గురించి కొన్ని సూక్ష్మాలు తెలిసేవి. కర్మ చేయటం అంతరంగ జీవిత పరిపక్వతకి "ఉపాయం"కాని "ఉద్దేశ్యం" కాదు అని దాదాపు అందరూ మరిచిపోయే సూక్ష్మాన్ని తిరిగి గుర్తుచేసేవారు. సంస్థాగతమైన ఆధ్యాత్మికత కత్తిమీదసాము. లేదంటే పట్టుకొన టానికి పిడికిలి లేకుండా అంతా కత్తే అయిన ఆయుధం. All blade without a handle! కోసేస్తుంది. కాని గుప్తంగా, అంతరంగ పరిణతికి ఒక ఉపకరణంగా కర్మని మలచుకొనే ఎన్నో సంస్థలకి

నాన్నగారి గుప్తదానం గురించి కూడా విన్నా. సాధనతో ఒంచి, ఒడిసి పట్టుకునే కర్మ హాని కలిగించదుకదా!

ఒక సందర్భంలో మరొక పాఠం నేర్చుకున్నా. ఇది కొంచెం సున్నితమైన సంగతి. వినయంతో విన్నవిస్తున్నా. నాన్నగారు తమ చేష్టల ద్వారానే చక్కటి ఆధ్యాత్మిక విషయాలని వెలికి తీస్తారు. సందర్భం ఏమిటంటే వారు నాకు ఒకసారి ఒక కానుక అందచేసారు. చేత ఉంచగానే, అప్రయత్నంగా, అనాలోచితంగా దాన్ని గ్రహించా. అంతా క్షణాలలో జరిగిపోయింది. వారి దగ్గర సెలవు తీసుకుని ఇంటికి వచ్చా. ఇంకా గంటకూడా కాలేదు మనసులో దిగులు ప్రారంభమైంది. వారికి సేవ చేసే అదృష్టం కన్నా కానుక ఉన్నదా అన్న ఆలోచన కలిగి కానుక గ్రహించటం దోషం అని నిర్ధారించు కున్నా. దానితో పాటు మనసంతా ఇది "నేరం" అన్న భావం, guilt complex ప్రారంభమయింది. మరి వారిని కలిసి సున్ని తంగా, వారికి నొప్పి కలిగించకుండా తిరిగి వాపసు చేయాలన్న సంకల్పం కలిగి ఆత్మీయులు లక్ష్మిగారితో చెప్పి, ఉదయం నాన్నగారి దగ్గరకు వెళ్ళటానికి ఒప్పించా.

ఆ మర్నాడు ఉదయం కలవటానికి నాన్నగారు అంగీక రించారు. గదిలోకి వెళ్ళగానే నమస్కరించి ఆ కానుకని బయటకు తీసా "ఇది అవసరంలేదు, మీ ఆదరాభిమానాలు చాలు. నాన్న గారూ" అని వారిచేత ఉంచబోయా. వారు నవ్వుతూ, నిశ్చలంగా నాకేసి చూస్తూ "ఇది ఏమిటి శివరామకృష్ణగారూ! ఇది నేను ఇచ్చినట్లు మీరు పుచ్చుకొన్నట్లు అసలు ఆ సంగతే మర్చిపొండి! ఆ ప్రస్థావనే రాకూడదు. అది నేను మర్చిపోయా. మీరూ మరిచిపోండి!" అన్నారు.

సాధారణంగా మృదువుగా ఉండే వారి కంఠంలో ఎంత నిశ్చ యాభిప్రాయం వ్యక్తం అయిందంటే నేను అవాక్కయ్యా. పైగా ఎంత ఆర్ద్రత, అభిమానం వారు వ్యక్తం చేసారంటే నేను ఊహించినవన్నీ దూదిపింజల్లా మనసులోంచి తేలిపోయాయి. సాధారణంగా వారి ఆనవాయితీ ప్రకారం, ఆ మాటల్ని రెండు మూడుసార్లు రిపీట్ చేసారు. మరి ఏ భావం దీని వెనుక? ఏ కోణం ఈ సంఘటనలో? ఒక పదం దాన్ని వ్యక్తం చేస్తుంది. కానుక పట్ల అనాసక్తత డిటాచ్ మెంట్. ఇచ్చేది, పుచ్చుకునేది ఆయనే అనే అటాచ్‌మెంట్ నాపట్ల. మరి ఇటువంటి సందర్భాలు కదా కన్నీళ్ళు తెప్పించి మాలిన్యాన్ని క్షాళనం చేసేవి?

తెలుగు భాగవత కర్త పోతనామాత్యుల పదాలు "భక్తపాలన కళ". ఆ విధంగా చూస్తే, నాన్నగారి భక్తపాలన కళకి సొగసులు, ఎన్నో అందాలు కనిపించాయి. వీటికి పరాకాష్ఠ: ప్రేమ. శ్రీరామ కృష్ణులు అనేవారు: "భక్తి అడుగు ఇస్తా. మోక్షం అడుగు సరే, తీసుకో! కాని ప్రేమా? కష్టం - అది ఇవ్వటం". ఆ ప్రేమని అపూర్వ మైన తమ శైలితో నాన్నగారు పంచుతారు. వారి "అమృతవాహిని" లో, వాణిలో బిందువులు ఆ ప్రేమనే రంగరించుకుంటాయి. రుచి చూసినవాళ్ళ అదృష్టం అనిర్వచనీయం. మీ అనుమతితో, నేను సైతం ఈ బృందంలో చేరాలనే/చేరాననే నా ఆకాంక్ష, విశ్వాసం.

వివేకచూడామణిలో శంకరాచార్యుల వారు అంటారు. "శాంతా మహాంతో నివసింతి సంతా వసంతవత్ లోకహితాః చరంతి" మహాత్ములు లోకహితం కోసం వసంతరుతువులా (అవధూతవలె) చరిస్తారు, మనల్ని తరింపచేస్తారు. నాన్నగారు ఆ

కోవకి చెందినవారిలో అగ్రగణ్యులు కదా! "దర్శన మాత్రేణ.." అంటారు. దర్శనంతోనే ప్రారంభించా. దానితోనే ఈ అనుభవాలని ముగించటం ఉచితం!

# శ్రీ నాన్నగారితో ముఖాముఖీ

- ప్రేమానంద

2002లో, అరుణాచల ప్రశాంత వాతావరణంలో నాన్న గారిని మొట్టమొదటిసారిగా దర్శించా. ఇది వారి సత్సంగ సమావేశంలో. గత ఏడేళ్ళుగా నా అరుణాచల వార్షిక యాత్ర సత్సంగ సమావేశం కోసం వారు దయతో తమ ఆశ్రమాన్ని ఉపయోగించుకోనిచ్చారు. నేను నిర్వహించిన ఈ ముఖాముఖీ సమావేశాల్లో మొదటిది నాన్నగారితోనే. ఆ సమయంలో ఒక అనువాదకుణ్ణి దగ్గర ఉంచుకుని, ఒక పరుపుపై కూర్చుని నా ఈ ముఖాముఖీ ప్రసంగాలు ఉన్న పుస్తకం విజయవంతం అవుతుందని చెప్పారు. నాన్నగారు చాలా సరళమైన వ్యక్తులు. నాన్నగారికి రమణమహర్షి పట్ల, వారి అసంఖ్యాకమైన భక్తులపట్ల అంకితభావం ఉన్నది. ముఖాముఖీ ఈ విధంగా ప్రారంభమయింది.

**ప్రేమానంద:** రమణమహర్షి “నేను ఎవరు?” అన్న మౌలికమైన ప్రశ్న ప్రతిపాదించారుకదా! మరి, నాన్నగారూ, “మీరెవరు?”

**నాన్నగారు:** నేను అమృతమయమైన చైతన్యాన్ని. చాలామంది పాశ్చాత్య ఆధ్యాత్మిక అన్వేషకులు ముక్తికోసం, అది ఒక

అనుభవం అన్న భావనతో, భారతదేశానికి వస్తారు. అసలు ముక్తి లేక ఆత్మానుభవం అంటే ఏమిటి? ముక్తి ఆత్మసాక్షాత్కారం అంటే పరమసత్య దర్శనం ఆ అనుభవం. ఆ పరమ సత్యానుభవం కలిగితే స్వేచ్ఛ వస్తుంది. పునర్జన్మ నుంచి విడుదల, అన్ని బంధాలనుంచి స్వేచ్ఛ, జ్ఞానోదయం అంటే సత్యానుభూతి.

ప్రే: ముక్తికోసం ఈ సత్యాన్వేషణ. భారతదేశానికి వచ్చినపుడు వాళ్ళకి ఉన్న భావం జ్ఞానం, ముక్తి అన్నవి అన్వేషించి తెలుసుకోదగిన వస్తువులు, సంపాదించదగిన అంశాలు అని. ఇది వాస్తవమేనా?

నా: భారతదేశంలో ఆ అనుభూతిని, అనుభవాన్ని పొందిన వ్యక్తులు ఉన్నారు. ఎందరో మహాత్ములు, ప్రవక్తలు, అన్వేషకులు, మునులు ఉన్న దేశం భారతదేశం. ఆధ్యాత్మిక విషయాలని భారతదేశం నుంచి పాశ్చాత్య దేశాలు నేర్చుకోవాలి. అదే విధంగా సాంఘిక సంక్షేమం, లౌకికమైన అంశాల గురించి భారతదేశం పాశ్చాత్య దేశాల నుంచి నేర్చుకోవాలి.

భారతదేశం ఆధ్యాత్మిక కేంద్రం. ఒకరిద్దరు కాదు ఆత్మానుభూతి పొందిన ఎందరో మహాత్ములు, మహానుభావులు భారత దేశంలో ఉన్నారు. కొందరు ప్రకటితమవుతారు. కొందరు అజ్ఞాతంగా ఉన్నారు. సత్యానుభవం ఉన్న వాతావరణంలో ఉండే నిశ్చయంగా సత్యానుభవం కోసం అన్వేషణ చేయాలి అపుడే, అది అంతర్గతం చేసుకోవాలని దానిని అవగాహన చేసుకోవాలన్న ఉద్దీపన, ఉత్సాహం కలుగుతాయి. ఈ కారణంగానే చాలామంది పాశ్చాత్యులు ఈ దేశానికి వస్తారు.

ఈ దేశంలో చాలా పుణ్యక్షేత్రాలు, పవిత్రస్థలాలు ఉన్నాయి. ఇది చాలా పురాతనమైన పుణ్యభూమి. ఎందరో మేధావులు, ఆధ్యాత్మికత మూర్తీభవించిన పాలకులు, ఆత్మసాక్షాత్కారం చేసుకున్న మహనీయులు, ఈ పథంలో గణనీయమైన ప్రగతి సాధించిన వారు, ఎంతో పురోభివృద్ధి కాంచిన మహాత్ములు ఇక్కడ ఉన్నారు. ఈ జ్ఞానుల వద్ద శిక్షణ పొందటానికే పాశ్చాత్యులు ఇక్కడకు వస్తారు.

మీరు సత్యదర్శనం చేయాలి. ఆ పరమసత్య అనుభూతి ఉంటేగాని మీకు ముక్తి లభించదు. తెలిసినదాని నుంచి మనకు స్వేచ్ఛ ఉండాలి.

ప్రే: ఈ "సత్యం" అంటే ఏమిటో మాకు చెప్పగలరా?

నా: సత్యం అంటే అనాది, అనంతమైనది. ఈ సత్యం యొక్క సహజ ఫలితాలు ముక్తి, ఆనందం, జ్ఞానం, అమరమైన చైతన్యం. చావు, పుట్టుకలు లేని ప్రకృతి ఆ సత్యం. అది అన్ని బాధలకి, సంప్రదాయాలకి, కట్టుబాట్లకి అతీతం అయినది. మేము ఆ సత్యాన్ని, పరమాత్ముని, యదార్థాన్ని అంగీకరిస్తాం. మనసే సంస్కృతులని, సంప్రదాయాలని, కట్టుబాట్లని సృష్టిస్తుంది. సృష్టించటానికి వీల్లేని అంశం ఒక్క పరమసత్యమే. మీకు తెలిసినా తెలియకపోయినా సత్యం ఎప్పటికీ అస్తిత్వమై ఉంది. పరమసత్యం తప్ప మిగతావన్నీ మనస్సు సృష్టించినవే.

ప్రే: దీనికి అర్థం ఏమిటంటే సత్యాన్వేషణకి ఈ దేశానికి వస్తే, వాళ్లు వాస్తవంగా ఆ పరమసత్య రూపులే అయి ఉన్నారు ఆ అన్వేషణ చేసేవాళ్ళందరు అవునా!

నా: అవును. మా మనుగడ ఆ పరమ సత్యంతోనే అస్తిత్వమై ఉంది. మీరొక్కరేకాదు. అందరూ, ప్రతిఒక్కరూ, ఆ పరమ సత్యంలోనే మనుగడ సాగిస్తున్నారు. ఈ యదార్థం తెలిసిన వ్యక్తే ద్రష్ట, రుషి. తనలోనే అస్తిత్వమై ఉన్న ఆ సత్యం తెలియకపోతే, అతను ద్రష్టకాదు. అది తెలిస్తే మీరు స్వేచ్ఛా జీవులవుతారు, ద్రష్టలవుతారు. ఇది తెలియనపుడు పరిస్థితులకి, ఇష్టాయిష్టాలు మొదలైనవాటికి బానిసలవుతారు. పరమసత్యం ఉన్నది. కాని అసలు సమస్య మీకు ఆ వాస్తవం తెలుసునా, తెలియదా అన్నదే. అది తెలిస్తే దుఃఖంలేని స్థితిలో ఉండి ఆనందమయమైన జీవితం గడుపుతారు. ఆ సత్యానుభూతి లేకపోతే, దు:ఖం జన్మజన్మలకి మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుంది. ఒక్క సత్యమే దు:ఖరహితం, దాస్యరహితం అయినది. అదొక్కటే అన్ని అర్థరహితమైన ప్రేలాపనల నుంచి విడివడి స్వేచ్ఛగా ఉన్నది.

ప్రే: అంటే ఇక్కడ ఒక తమాషా ఉన్నది. తాము ఆ పరమసత్యం యొక్క రూపాలు అయి ఉండి కూడా, దానిని అన్వేషించటానికి భారతదేశం వస్తారు. ఇది హాస్యాస్పదం అయిన పరిస్థితి కదా?

నా: అవును. నిజమే. వాళ్ళు ఆ పరమసత్య రూపాలే అన్న వాస్తవం గురించి ఏ సందేహం లేదు. అయితే హృదయంలో ఉపస్థితమై ఉన్న ఆ పరమ సత్యాన్ని ఎట్లా తెలుసుకోవాలి అన్న అన్వేషణకి మార్గదర్శకత్వం కోసం వాళ్ళు భారతదేశానికి వస్తారు. అటువంటి మోక్షానుభవం ఉన్న గురువు దొరకకపోతే మీరు

కేవలం మనసు, శరీరం మాత్రమే అని భావిస్తూ ఉండి పోతారు. ఆంతర్యంలోనే కాక బహిరంలో కూడా ఈ భావన ఉంటుంది. కాని ఎవరేనా జ్ఞాని కాని, ఆత్మజ్ఞానదర్శిని కాని దర్శిస్తే, వాళ్ళ సమక్షంలో నివసిస్తే "అవును నేను ఆ ఆత్మస్వరూపాన్నే" అన్న భావన వస్తుంది. "నాలో ఆ పరమ సత్యం ఉన్నది. ఆ అనుభవం నా సొంత చేసుకోవాలి" అన్న ఉత్సాహం కలుగుతుంది. జ్ఞానుల దర్శనం చేసుకున్న ఫలితంవల్లనే ఇది జరుగుతుంది.

ప్రే: నాకు అర్థమైంది. మీ సమక్షంలో కూర్చుని ఆనందించటానికి కారణం అదే. మీ నేత్రాలు ఎంత సౌందర్యవంతమైనవో!

నా: మంచిది! మీకు కృతజ్ఞతలు (అందరూ ఆనందంతో నవ్వులు)

ప్రే: ఈ అనుభవానికి, అది రావటానికి, ఏవైనా అర్హతలు ఉన్నాయా? దీని కోసం సాధన అవసరమా?

నా: ఈ జ్ఞానానుభవానికి అర్హతలా? ద్వంద్వమైన సత్యం తెలుసు కోవాలంటే అర్హతలు కావాలి. హృదయం, మనసు, వాక్కు, కర్మ ఐక్యం అవ్వాలి. మనసు-వాక్కు, మనసు-హృదయం, మనసు-వాక్కు-కర్మ ఇవన్నీ ఒకటవాలి. సత్యానుభవానికి ఇదే ప్రధానమైన అర్హత.

ఇంతేకాదు జ్ఞానానుభవానికి పవిత్రత కూడా ఉండాలి. ఈ పవిత్రత రావాలంటే మానసిక సంయమనం అన్నిటిలోకి ముఖ్యమైన అర్హత. మనస్సుని అదుపులో తెచ్చుకొనటం నేర్చుకుంటే కాని, మనలో స్వతస్సిద్ధంగా నిక్షిప్తమై ఉన్న సత్యాన్ని తెలుసుకొనటానికి దానిని ఏకాగ్రం చేయలేము. అటువంటి

మనసు ఉద్భవించినపుడు, అక్కడే సత్యం ఉంది. ఇది ద్వంద్వ పరమైన సత్యంకాదు. సత్యం అంటే నా దృష్టిలో వాస్తవమైన, యదార్థమైన సత్యం. అది అద్వితీయమైన సత్యం!

ప్రే: మీ దృష్టిలో మనస్సుని లొంగదీసుకొనటం అంటే దాని అర్థం ఏమిటి?

నా: చంచలంగా, అటుఇటు పయనించే, పరుగెత్తే మనసుని అడ్డు కొనటమే మనసుని లొంగదీసుకొనటం అంటే. దానికి అర్థం అదే. మనసు అటు ఇటూ పరుగిడినపుడు, ఆ చాంచల్యం ద్వారా అనవసరమైన ఆలోచనలు, దుఃఖం వస్తాయి. పైగా దీనివల్ల శారీరకమైన, మానసికమైన అనారోగ్యం కూడా వస్తుంది. మనసు అధికంగా అటుఇటూ చంచలంగా వెళ్ళటం కేవలం ఆధ్యాత్మిక జీవితానికే కాదు. భౌతికమైన జీవితానికి కూడా చెడ్డదే. అందువల్ల మానసిక ఏకాగ్రత ఉన్న శక్తి అతిముఖ్యం అయినది.

ప్రే: ఈ విషయంలో మీరు ప్రత్యేకమైన అభ్యాసం ఏదైనా సూచిస్తారా?

నా: మనస్సుని అదుపులో పెట్టే ఉపాసన ఉంది. ఎవరేనా దైవం, లేక గురువుపైన మీ మనసుని ఉంచండి. ఆయన దివ్య నామాన్ని, రూపాన్ని స్మృతికి తెచ్చుకోండి. మీకు అనువైతే ప్రాణాయామం కూడా చెయ్యండి. ఇది కూడా మనసుని అదుపులో ఉంచుకొనటానికి మంచిదే. కాని అత్యుత్తమమైనది ఉపాసన. ఉపాసన అంటే ఎల్లవేళలా అరుణాచలం గురించి భావన చేయటం. ఆ నామాన్ని స్మృతిలో నిలుపుకొనటం.

ఒకే ఒక్క అంశాన్ని భావించాలనుకుంటే భగవంతుడి గురించి ఆలోచించండి. అదేవిధంగా పరమసత్యం గురించి నిరంతరం ఏ విలంబనం లేకుండా భావించినా, మనసు ప్రశాంతమవుతుంది. అదుపులోకి వస్తుంది. మనసు యొక్క చంచలమైన స్పందనలన్నీ ఆగిపోతాయి. "ఉపాసన" అన్నది సంస్కృత పదం. "ఉప" అంటే మానసిక సంయమనం. అని అర్థం (MInd control) భారతదేశ సంప్రదాయం ప్రకారం ఉపాసనకి మీరు అలవాటు పడకపోతే మీరు ఆధ్యాత్మికానుభవం పొందలేరు.

ప్రే: ధ్యానాన్ని మీరు సిఫారసు చేస్తారా?

నా: ఉపాసన అన్నది ఒక విధమైన ధ్యానమే. మూడు ముఖ్యమైన అంశాలని నేను చెపుతాను. అనాసక్తత, నిత్యానిత్య వివేకం, ధ్యానం. ధ్యానం కూడా మనసుని అదుపులో ఉంచటానికి సహాయ పడుతుంది.

ప్రే: పరమసత్యానుభవానికి సాధన అవసరమా?

నా: ఒక సాధకుడు, అంటే ఆధ్యాత్మిక సత్యాన్వేషి ఉన్నాడు అని భావిస్తే సాధన అవసరమే. అసలు ఆధ్యాత్మిక సాధకులే లేనపుడు సాధన ప్రసక్తే లేదు (ఇద్దరూ నవ్వుతారు)

ప్రే: అందువల్ల నేనే ఫలానా వ్యక్తిని అని అనుకున్నప్పుడు ధ్యానించవలసిన అవసరం ఉంది. కాని ఎవరూ లేకపోతే, వ్యక్తిత్వం అన్నది ఏదీ లేకపోతే, నాకు ధ్యానించవలసిన అవసరంలేదు. అంతేనా?

నా: సత్యాన్వేషకులని ఉద్దేశించే, వాళ్ళ సౌలభ్యం కోసమే ధ్యానం

అవసరం. ఆత్మ సాక్షాత్కారం పొందినవారికి ధ్యానం అనవసరం. ధ్యానం అంటే గమ్యంకాదు. అది గమ్యాన్ని చేరటానికి మాధ్యమం మాత్రమే. సత్యాన్ని అన్వేషించే వ్యక్తికే ధ్యానం అవసరం.

ధ్యానించేది ఎవరు? మనసే ధ్యానిస్తుంది. మనసే లేనపుడు, ధ్యానం అవసరం కూడా లేదు. జబ్బు ఉంటే మందు కావాలి. కాని జబ్బు లేకపోతే మందు అవసరమే లేదు. ధ్యానించేది ఎవరు? కేవలం మనసే ధ్యానించేది. మరి మీకు మనసే లేనపుడు ఎవరు ధ్యానం చేస్తారు?

ప్రే: రమణులు ఆత్మజ్ఞానానికి ఆత్మవిచారణే అన్నిటిలోకి ఉత్తమమైన అపరోక్ష పద్ధతి అన్నారు. ఈ ఆత్మవిచారణ పద్ధతి గురించి మీరు ఏమి చెపుతారు?

నా: ఆత్మవిచారణ ద్వారా రమణులు ఆత్మానుభవాన్ని పొందలేదు. ఆత్మవిచారణ పద్ధతినేకాక, రమణులు ప్రపత్తి (ఆత్మసమర్పణ) కూడా బోధించారు. సంపూర్ణ ఆత్మసమర్పణ, పాక్షిక ఆత్మసమర్పణ: రెండింటికీ వారు సమానమైన ప్రాముఖ్యత ఇచ్చారు. ఆధ్యాత్మిక ప్రథమదశలో, పాక్షికమైన ఆత్మసమర్పణ ఉంటుంది. అంత్యదశలో సహజంగానే, సంపూర్ణమైన ఆత్మసమర్పణ జరుగుతుంది. ఈ రెండు మార్గాలకే వారు చాలా ప్రాముఖ్యత ఇచ్చారు. భగవదేచ్ఛని అంగీకరించి, దాని పరిధిలో భగవంతుడు ఉన్నాడన్న వాస్తవం పట్ల మీకు పూర్తిగా విశ్వాసం ఉండి, ఒక సకాలాతీత శక్తి రూపం ఈ జగత్తుని నడిపిస్తున్నదన్న నమ్మకం కూడా దానికి తోడుగా

ఉంటే, మీకు ఆత్మ సమర్పణ మార్గం అత్యుత్తమైన మార్గం. ఆవిధంగా కాక, ఈ ప్రపంచం యొక్క అస్తిత్వంపైన అచంచల మైన సందేహం ఉండి, భగవంతుడి ఉనికిని శంకిస్తూ ఉంటే, ఆ మనఃస్థితిలో ఆత్మవిచారణ అతి ముఖ్యమైనది.

ప్రే: అటువంటప్పుడు, ఆత్మవిచారణని అనుసరిస్తున్నపుడు కూడా, మనం నిరంతరం ఆ భగవంతుడి ఉనికి గురించి అప్రమత్త స్థితిలో ఉన్నాము అని చెప్పవచ్చా?

నా: మనసు ఆవిర్భవిస్తే ప్రపంచం, భగవంతుడు రెండూ ఉంటాయి. కాని ఆ మనసే ఈ జగత్తు, భగవంతుడు లేవు అని నిశ్చయిస్తే దాని ద్వారా మనసు లయమయిపోతే శేషిం చేది ఆ పరమసత్యమే. హృదయంలో నిక్షిప్తమైన పరమ సత్యంలో మీ మనసుని ఉంచితే, అదే యదార్థమైన అన్వేషణ. ఒకే సత్యం ఉన్నది, అమృతమయమైన ఒకే చైతన్యం ఉన్నది, మీ హృదయంలో అన్ని కాలాలలోనూ స్థితమై ఉన్న (ఇప్పటికీ, ఎప్పటికీ ఉన్న) ఒక చైతన్యం ఉంది.

చేయవలసిందల్లా, మీ మనసుని అది ఎక్కడనుంచి ఆవిర్భ విస్తుందో అక్కడ ఉంచండి; అపుడు భగవంతుడి గురించికాని, ఈ జగత్తు గురించికాని ఆలోచించక్కర్లేదు. ఎందుకంటే మనసు జాగృతమయి, ఆవిర్భవించిన వెంటనే భగవంతుడు ప్రవేశిస్తాడు, ఈ జగత్తు ఉనికి వస్తుంది. సమస్తం ఆవిర్భ విస్తుంది. భయం పుట్టుకొస్తుంది, మనం వేరు అన్న భావం వస్తుంది. "ఇతరులు" వస్తారు.

భగవంతుడి గురించి ఆలోచించేది ఎవరు? మనసే భగ

వంతుడి గురించి ఆలోచిస్తుంది. ఆత్మవిచారణకి ఈ జగత్తు ముఖ్యంకాదు. దైవం ముఖ్యంకాదు "ఎవరు ఈ ఆత్మాన్వేషణ చేసేది?" మనసే ఆత్మవిచారణ చేస్తోంది. అందువల్ల ఆ మనసు అణగాలి, ఆ అణగారిపోవటాన్ని అంగీకరించాలి. మనసుని అదుపులో ఉంచితే, ఉంచగలిగితే, ఆ మనసుని దాని మూలంలోకి తిరిగి పంపగలిగితే, ఆ స్థితిలో ఈ జగత్తూ లేదు, ఆ జగదీశ్వరుడూ లేదు.

ప్రే: అంటే ఆత్మసమర్పణ (ప్రపత్తి), ఆత్మవిచారం అన్న రెండు మార్గాలు యదార్థంగా లేవు; నిజానికి అవి రెండూ ఒకే మార్గం అని అనుకోవచ్చా?

నా: రెండు మార్గాలు ఉన్నాయి. కాని ఆ రెండూ కూడా ఒకే గమ్యానికి, లక్ష్యానికి తీసుకువెళతాయి. నిస్సందేహంగా ఆ రెండూ ఒకే గమ్యానికి, ఒకే లక్ష్యానికి తీసుకెళతాయి. కాని ఎన్నో రకాల మానసిక ప్రవృత్తులు, సంస్కారాలు ఉన్నాయి. "నేను ఎవరు?" అన్న ప్రశ్నకు బదులుగా, దాని స్థానంలో "ఇది ఎవరు?" అన్న ప్రశ్నని ఉంచండి. ఆ తర్వాత "ఈ మనసు ఎవరు?" అన్న ప్రశ్న లేవనెత్తండి. ఈ విధంగా నిరంతరం మనస్సుని ప్రశ్నిస్తూ, పురోగమిస్తే, అది తన మూలాలలోకి వెళుతుంది. మనసు ఎక్కడైతే పుట్టుకొస్తుందో, అక్కడే శాశ్వతత్వం, అవినాశి అయిన ఆ పరమసత్యం జనన, మరణాల ఎరుకలేనిది, ఉన్నది.

ప్రే: రమణులని ఒక ప్రశ్న అడిగారు: "ఎపుడు ఈ ఆత్మానుభవం పొందగలం?" దీనికి సమాధానం చెపుతూ రమణ భగవాన్

ఈ దృశ్యమాన జగత్తు ఎపుడు తొలగించబడుతుందో, అపుడు ఆత్మానుభూతి కలుగుతుంది. అపుడు ఆ ఆత్మ దృగ్గోచరం అవుతుంది" అన్నారు. ఈ ప్రపంచం గురించి వాస్తవమైన అవగాహన ఏమిటి?

నా: మనం ఇదివరలో తెలుసుకున్నాం: సరైన దృష్టితో, ఒక తాడు యొక్క నిజమైన రూపాన్ని గ్రహిస్తే, ఆ రజ్జు సర్పం కాదు. పాములా కనిపించే తాడు మాత్రమే అది. "అది పాము, అది పాము" అని మీరు భావించినా సరే, అది పాముకాదు. తాడుని సరిగ్గా చూడగలిగితే పాము ఉనికి లేనే లేదు. పాము కేవలం ఒక భ్రమ. అది వాస్తవం అని భ్రమింపచేస్తుంది. తాడుని చూచినపుడే- తక్షణమే- కాకుండా అంతకుమునుపే అది అదృశ్యమై ఉన్న (లేని) వస్తువు.

అదేవిధంగా ఈ ప్రపంచం కూడా ఉన్నట్లు కనిపిస్తుంది. నిజానికి అసలు ఈ ప్రపంచమే లేదు. ఉన్నట్లు ఆనుతుంది. తాడు అసలు స్వరూపం అవగతమయినపుడు, సర్పం లేనే లేదు. పరమసత్యం దర్శిస్తే, ప్రపంచంలేదు. తాడులో పాము ఉన్నట్లు అనిపించినట్లే ఆ పరమసత్యంలాగే ఈ ప్రపంచం ఆనుతుంది. ఆ పరమసత్యం యొక్క అపరోక్ష దర్శనం అయితే ఆ సత్యాన్ని ముఖాముఖీ చూచినపుడు, చూడటానికి ఈ ప్రపంచం ఉంటేకదా! అదే విధంగా అదుపులో ఉంచటానికి ఒక మనసూ లేదు.

ప్రే: మరి ఈ ప్రపంచాన్ని తొలగించటం ఎట్లా?

నా: ఆ అఖండసత్య దర్శనం మీకు అనుభవం అయితేకాని, మీ

మనసు నుంచి ఈ ప్రపంచాన్ని తొలగించలేరు. ప్రపంచాన్ని చూచినపుడే భయం వస్తుంది, ద్వంద్వాలు వస్తాయి, కాంతి వస్తుంది, దర్శనాలు వస్తాయి. మనకి అసంబద్ధం, అహేతుకం అయిన ప్రతీదీ సృష్టించబడుతుంది. ఇంతేకాదు ఆ భయమే మరణాన్ని, దుఃఖాన్ని తెస్తుంది ముఖాముఖీగా అపరోక్షంగా, ఆ సత్యాన్ని యథాతథంగా అనుభూతి పొందినపుడు, ధ్యానం చెయ్యండి, ఆ స్థితిలో ఈ ప్రపంచం అంతా మనసు నుంచి అదృశ్యమవుతుంది. మీరు ఏ విధమైన సాధన చేసినా, ఇదే జరుగుతుంది.

ప్రే: ముక్తి లభించాలంటే మనో నాశనం జరగాలి అని సూచిస్తూ ఉంటారు. మరి మీకు ఒక మనసు ఉన్నదా?

నా: ఉంది. నాకు సాత్వికమైన (ప్రశాంతమైన) మనసు ఉంది. నా మనసు పనిచేస్తుంది, అది స్పందిస్తుంది (యాక్ట్) కాని ప్రతిస్పందించదు (రియాక్ట్). ఏ రకమైన ప్రతిస్పందన, ఏ పరిస్థితులలోనూ లేదు. అవును నాకూ మనసు ఉంది. కాని అది సాత్వికమైన మనసు. అది ప్రశాంతమైన మనసు.

ప్రే: ముక్తిని వర్ణించవలసి వచ్చినపుడు రమణులు "మనోనాశం" అన్న పదం ద్వారా ఈ స్థితిని వర్ణించారు. దీనిని "నాశనమైన మనసు" అన్న అర్థంతో సూచించారు. మనో నాశనం ఎట్లా చేయాలి?

నా: హృదయ కుహరంలో మనసుని నిరంతరం ఉంచితే మనో నాశనం జరుగుతుంది. నిస్సందేహంగా మనోనాశనం

అవసరమే. అయితే దీనికి అర్థం దగ్ధమయిపోయిన రజ్జువు (తాడు). దగ్ధమైన తాడు కూడా తాడు లాగనే అగుపిస్తుంది; కాని ఏమీ లేదు. అది తాడులా కనిపించినా అది దేనికీ పనికిరాదు.

ప్రే: అంటే, దీని అర్థం మనసు నిజంగా నాశనమయిందని కాదు; దీని అర్థం ఏమిటంటే మనసు పనిచేస్తుంది, కాని కాటు వేయటానికి కావలసిన శక్తి దానికి లేదు.

నా: మనసుకి ప్రయోజనం ఉంది. కాని అది దగ్ధమైన తాడు కనుక మిమ్మల్ని నిరోధించదు. శుద్ధమైన స్థితిలో ఉన్న, పవిత్రీకరించబడ్డ మనసే సత్యం. సాధనలో అతిముఖ్యమైన అంశం మనసుకి పవిత్రతని చేకూర్చటం ఆ పరిశుద్ధతను సాధించటం.

ప్రే: పవిత్రమైన మనస్సు అని మీరు చెప్పేది, "శూన్య మనసు" (నో మైండ్) అని బౌద్ధులు చెప్పేది ఒకటేనా?

నా: "శూన్య మనసు" పవిత్రీకరించిన మనసుకి సమానం. ఆ రెండూ ఒకటే దీన్ని గురించి మనకి సందేహం అవసరం లేదు.

ప్రే: మరి మనసుకి చెందిన "వాసనల" సంగతి ఏమిటి?

నా: చిత్తవృత్తులు గతజన్మల ఫలితాలు. ఏదేనా పనిచేసారను కోండి. దాని ఫలితం మీరు ఆశిస్తారు; వాటితో సంతోష పడతారు. ఆ ఫలితంవల్ల సంతోషం కలిగినపుడు, ఒక మనో స్పందన కలుగుతుంది; ఆ స్పందన ద్వారా ఒక ఆలోచన (థాట్, భావం) ఉద్భవిస్తుంది; ఆ భావంవల్ల ఒక స్వార్థ

పూరితమైన క్రియ వస్తుంది. శరీరంపైన ఆధారపడి, మనసుకి కట్టుబడిన ఆ క్రియద్వారా వాసనలు వస్తాయి. మంచివి, చెడ్డవి ఏ విధమైన క్రియ నుంచి వచ్చిన ఫలితాలనైనా మీరు సంతోషంతో అనుభవిస్తే తప్పకుండా వాసనలు ఉద్భవిస్తాయి. భగవత్ సాక్షాత్కారానికి, ప్రధానం, మౌలికం అయిన అవ రోధం ఈ వాసనలే. వాసనలు మంచి-చెడు ఏమైనా సరే, మన ఆధ్యాత్మిక ప్రగతికి అడ్డుకట్ట కడతాయి. ఆధ్యాత్మిక సాధనలో ఈ వాసనలే మనోవృత్తులని (హాబిట్స్) తయారు చేస్తాయి. ఈ అలవాట్లే మనల్ని బంధించే గొలుసులు. ఇవన్నీ వాసన వలననే కలుగుతాయి. అందువల్ల వాసనలన్నిటినీ సమూలంగా తుడిచివెయ్యాలి. పూర్తిగా తొలగించాలి. ఇక్కడ ఏ మెతక వైఖరికి ఆస్కారం లేదు. భగవత్ సాక్షాత్కారానికి వాటిని కచ్చితంగా తొలగించాల్సిందే. ఆధ్యాత్మిక సాధన యొక్క ప్రయోజనం ఈ వాసనలను తొలగించటమే. సహ జంగా, సున్నితంగా ఈ వాసనలనుంచి, సంస్కారాల నుంచి మీరు దూరంగా తొలగినపుడే, ఆత్మానుభవం వస్తుంది. ఆత్మ విచారణ మార్గం కాని, భక్తిమార్గంకాని ఏ మార్గాన్ని అనుస రించినా, ముఖ్యమైన విషయం వాసనలని, సంస్కారాలని తొలగించటం.

ప్రే: సాత్వికమైన మానసిక స్థితిని సాధిస్తే, వాసనలన్నింటినీ తొలగించగలిగితే, వాటి బంధాల నుంచి తప్పించుకొనటానికి ఇది చాలని అనుకోవచ్చా?

నా: లేదు. అది చాలదు. సాత్వికమైన మనఃస్థితి ఆ సత్యాన్ని

ధర్శించే మార్గాన్ని మాత్రమే చూపుతుంది. అదే దాని లక్ష్యం, గమ్యం కాదు. కాని సాత్వికమైన మనఃస్థితిని తప్పకుండా ఆహ్వానించాలి.

ప్రే: అంటే ఒక వాసనని, సంస్కారాన్ని అవగాహన చేసుకోగలిగితే, దాని స్వభావాన్ని గ్రహిస్తే, ఆ వాసన ఇకపై ఎప్పుడూ బంధించదు అని అనుకోవచ్చా?

నా: ఆ వాసన మీలో ఒక మానసిక వృత్తిని సృష్టిస్తే అది మీకు బంధకారణమే. కాని ఆ వాసన మీ మనసుని చికాకు పెట్టకపోతే, అది ప్రమాదకరమైనది కాదు, పునర్జన్మని తీసుకురాదు.

ప్రే: "మీరు వాసనలని దగ్ధం చేయనక్కర్లేదు. వాటిని పసికట్టి అవగాహన చేసుకుంటే ఆ వాసనలు మీకు ఎప్పటికీ బంధకారణం అవవు." ఇదే కదా మీరు చెప్పేది?

నా: మనం వాసనలని పూర్తిగా తొలగించాలి. ఏ మాత్రం ఒక వాసన ఉన్నా, అది భయాన్ని కూడా తెస్తుంది. ఏ మాత్రం భయం లేని స్థితిని పొందాలంటే వాసనలని తొలగించుకోవాల్సిందే

ప్రే: వాసనలని ఎట్లా తొలగించుకోవాలి అన్నదే నా ప్రశ్న?

నా: వాసనలని ఎట్లా తొలగించాలి అని కదా ప్రశ్న? అది చాలా మంచి ప్రశ్న! ఎల్లప్పుడూ వాటి గురించే ఆలోచిస్తూ కూర్చుంటే అవి ఏనాటికీ తొలగిపోవు. వాటిని మీరు అధిగమించలేరు. వాటి గురించి ఆలోచించటం వాటిని ఆహ్వానించటమే. భగవంతుడు, పరమసత్యం, మీ గురువు: వీటి గురించే మీరు నిరంతరం ఆలోచించాలి. ఇది సాధించగలిగితే ఈ

వృత్తులకి ఆహారం అందించటం ఆగిపోతుంది. ఆహారం అందకపోతే, ఆ వాసనలు సహజంగానే కనుమరుగవుతాయి.

ప్రే: ఆత్మవిచారంలో చివరకు జీవన్ముక్తుడి గురించి చెపుతూ; సూక్ష్మమైన మనసు ఉండి, ఆత్మానుభూతి పొందిన వ్యక్తినే 'జీవన్ముక్తుడు" అని అన్నారు. దీన్నే ఆత్మ అనుభవం అయిన స్థితి అని చెప్పవచ్చునా?

నా: జీవన్ముక్తి, ఆత్మానుభూతి రెండూ ఒకటే. దీన్ని గురించి ఏ సందేహాలూ పెట్టుకోనక్కర్లేదు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఈ జీవన్ముక్తుడినే "స్థితప్రజ్ఞుడు" అని వర్ణించాడు. ఈ విషయం గురించి ఏ అనిశ్చితత, సందిగ్ధతా ఉండనవసరంలేదు.

ప్రే: రమణులు ఈ విషయాన్ని మరింత వివరిస్తూ అన్నారు: "చిదానందసాగరంలో మునిగి ఉండి, దానితో మమేకం అయి, అభేదమైన అస్తిత్వాన్ని కలిగి ఉన్న వ్యక్తినే 'విదేహ ముక్తుడు' అంటారు. ఈ విదేహముక్త స్థితినే 'తురీయావస్థ' అంటారు. ఇది పరమలక్ష్యం" ఈ స్థితినే 'జ్ఞానోదయం' అని అనవచ్చా?

నా: "జీవన్ముముక్తుడికి" విదేహముక్తుడికి తేడా లేదు. రమణ మహర్షి, బుద్ధుడు, శంకరుడు: వీరందరూ జీవన్ముక్తులు. క్రీస్తు విదేహముక్తుడు. తన శరీరం పరిత్యజించే ముందు క్రీస్తు ఈ విధంగా అన్నారు: "నేను, నా తండ్రీ (పరమపిత) ఒకటే!" జ్ఞాని, ముక్తీ ఒక్కటే. ముఖ్యమైన విషయం అతనికి శరీరం ఉన్నదా, లేదా అని. నీ శరీరం త్యజింపబడి, ఆ

సమయంలోనే నీకు ఆత్మానుభావం కలిగితే, ఆ స్థితిని విదేహముక్తి అంటారు.

ఆత్మజ్ఞానం కలిగినపుడు, అవలోకించటానికి మనసు ఉండదు. భగవత్ సాక్షాత్కారం కలిగినపుడు పరిశీలించటానికి అదుపులో ఉంచటానికి మనసు ఉండదు.

ప్రే: ఒక గురువుని దర్శించటం, వారితో నివసించటం చాలా అవసరం అని తోస్తున్నది. గురువు ఎవరు? గురువు పాత్ర ఏమిటి? నిజమైన గురువుని గుర్తించటం ఎట్లా?

నా: ఎంతో ప్రగతి సంపాదించిన, ఆత్మానుభవం పొందిన, ఉత్తములైన వ్యక్తుల నుంచి ఉత్తేజం పొందటం మంచిది. పరమ సత్యానుభవానికి మంచితనం, సౌమ్యత కూడా దోహదం చేస్తాయి. ఆధ్యాత్మానుభవంలో మంచితనం కూడా అతి ముఖ్యమైన అంశం. సాధనలో ఒక అంశం మంచిగా ఉండటానికి ప్రయత్నించటం; అది సాధుసత్సంగం. ఒక గురువు సమక్షంలో ఉండగలిగితే అది ఎంతో మంచిది, ఎంతో శుభప్రదం. అది కనక సాధ్యపడకపోతే మానసిక పరిధిలో సంపర్కం అతిముఖ్యమైనది. సత్యానుభవం సాధించటానికి అది మీకు ఎంతో ఉపకరిస్తుంది. ఇంగ్లీషులో ఒక నానుడి ఉంది: "నువ్వు ఏ విధంగా ఆలోచిస్తావో ఆ విధంగానే నువ్వు ఉంటావు." మానసికంగా గురువు సంపర్కంలో ఉండటం ఎంతో అవసరం. ఎందుకంటే అది మనకు ఎంతో మానసిక స్థైర్యాన్ని ఇస్తుంది.

గురువు ఎవరు? అని ప్రశ్న. రమణ భగవాన్ దైవం, గురువు, ఆత్మ అన్నీ ఒకటే. భేదం లేదు. అన్నారు. మనం ఏ తేడాని చూడవలసిన అవసరంలేదు. ఉన్న సత్యం ఒక్కటే: అదే పరమసత్యం. దీనినే భగవంతుడని, ఆత్మ అని, గురువు అనీ అనచ్చు. సరే, గురువు అంటే ఎవరు? ఒక వ్యక్తి మీకన్నా ఈ మార్గంలో చాలా పురోభివృద్ధి సంపాదించాడు అనుకుందాం. ఆ వ్యక్తి ఆత్మానుభవం పొందకపోయినా ఆ వ్యక్తి దగ్గర మనకి కొంత మార్గదర్శకత్వం లభిస్తుంది. నేను ప్రాథమిక తరగతిలో ఉన్నా. పదవ తరగతిలో ఉన్నతని దగ్గర్నించి నేను గణితంలో పాఠాలు నేర్చుకోవచ్చు. దీనికోసం ఆ పదవ తరగతి విద్యార్థి పి.హెచ్‌డి. డిగ్రీ పొందక్కర్లేదు కదా!

గురువు అని గ్రహించటానికి, ఆ గురువుకి రెండు అర్హతలు చాలా ముఖ్యం. అతనికి ఆత్మ యొక్క అపరోక్షానుభవం ఉండాలి. ఆ పరమసత్యాన్ని వివరించగలిగిన స్థితిలో కూడా ఉండాలి.

గురువు పాత్ర ఏమిటి? ఆయన భగవంతుడి ప్రతినిధి. గురువు అంటే భగవంతుడి ఆధీనంలో ఉన్న వ్యక్తి. ఆయన శరీరం కూడా అంతే. సమస్త మానవాళిని దుఃఖరాహిత్యస్థితికి తీసుకువెళ్ళటమే గురువు ధర్మం, ప్రయోజనం.

నా దగ్గరకు ప్రతీరోజూ రెండుమూడు వందల మంది వస్తూ ఉంటారు. వారు నా దగ్గర్నించి ఆశించేది ఏమిటి? ఉద్యోగం,

శక్తి, అధికారం, సంపద, మంచి ఆరోగ్యం ఏది ఆశించి నా దగ్గరకు వస్తారు? దుఃఖం లేని స్థితిని ఆశించే వాళ్ళు నా దగ్గరకు వస్తారు. ఈ శోకరహిత స్థితి వాళ్ళు ఒక సంతలో కొనుక్కునేదికాదు. గురువు అనుగ్రహం ద్వారానే ఆ శోకరహిత స్థితి కలుగుతుంది.

ప్రే: దీనికోసం ఒక మార్కెట్ లేదుకదా! (ఇద్దరూ నవ్వుతారు) అయితే నేను మాత్రం భారతదేశమే ఈ మార్కెట్ అనుకున్నా!

నా: నిజమైన గురువుని ఎట్లా గుర్తించాలి? దీనికి విశ్వాసం అతి ముఖ్యమైన అంశం. రమణుల సన్నిధిలో మీరు శాంతిని, ఆనందాన్ని అనుభవిస్తే, అపుడు ఆయనే మీ గురువు. శాంతి, ఆనందం అన్న భావాల అనుభవం, కొంత జ్ఞానానుభవం, శరీరం యొక్క అదుపు కొంత తగ్గిందన్న భావం ఇవి మీకు అనుభవంలోకి వచ్చినపుడు మీరు గురువు సన్నిధిలో ఉన్నారు. అపుడు ఆయనే మీ గురువు. పవిత్రత లేక సత్యానుభవం పొందిన మహనీయుడు: వీరి సన్నిధిలో సంతోషం, ఆనందం ఆవిర్భవిస్తాయి. ఇంతేకాదు, భౌతికంగా ఆధ్యాత్మికంగా శ్రేయస్కరమైనవి అన్నీ మీకు లభిస్తాయి.

ప్రే: ఈ ఆధ్యాత్మిక స్థితి గురించి ఎంతో కుతూహలం కలిగించే అంశాలు ఆధ్యాత్మికాన్వేషకులు మీనుంచి వింటారు. దయతో మీ దినచర్యగురించి, మీరు ఈ ప్రపంచాన్ని ఏవిధంగా చూస్తారో దాన్ని గురించి చెప్పండి?

నా. ఆధ్యాత్మిక సత్యానుభవాన్ని పొందినవాళ్ళు ఈ ప్రపంచాన్ని ఆ సత్యం యొక్క ఛాయగా, నీడగా దర్శిస్తారు. అది కేవలం

ఒక ఛాయ, నీడ, సత్యంకాదు. మనసు ఉంటే, ప్రపంచం ఉంటుంది. మనసు లేకపోతే, ఈ ప్రపంచం నుంచి తాను వేరు అన్న భావం ఉండదు. బాహ్యప్రపంచం తానే అని దర్శిస్తాడు. మీలో కూడా ఉన్న సత్యాన్ని దర్శిస్తాడు. అపుడు మీరు భయపడనక్కర్లేదు.

ప్రే. మీ అభిమానుల భక్తుల నేత్రాలని చూచినపుడు (లోచూపు) మీరు ఏమి చూస్తారు?

నా. వారిలో నన్ను నేను దర్శించుకుంటున్నా. ఆ తర్వాత ప్రేమ, కరుణ ప్రభావం చూపుతాయి.

ప్రే. మీరు చెప్పినదానికి అదనంగా మరేదైనా చెప్పాలను కుంటున్నారా?

నా. శరీరాన్ని ప్రారబ్ధానికి విడవండి. మన శరీరాన్ని, మనసుని గరిష్టమైన అవకాశం వరకూ ఉపయోగించాలి. భగవంతుడు మనకి ప్రసాదించిన ఈ కానుకని ఉపయోగించుకోవాలి. కొందరికి భగవంతుడు గొప్ప మేధస్సు ప్రసాదిస్తాడు; మరి కొందరికి సంపద ఇస్తాడు; లేదా చక్కగా ప్రసంగించే ప్రజ్ఞ ఇస్తాడు; కొంతమంది మంచి రచయితలు; వీటినన్నింటినీ ఆత్మసాక్షాత్కారం కోసం వినియోగించాలి. మరొక సంగతి భగవంతుడి దర్శనం కోసం, విరుద్ధంగా ఆలోచించటం ఆపాలి. శ్రేయస్కరమైన భావన అతిముఖ్యమైనది. వికృతమైన, అపరిశుద్ధమైన ఆలోచనలు చేసే మనుషులతో సంబంధాలు ఏర్పరచుకోకూడదు. మంచివాళ్ళతోనూ, మంచి ఆలోచనలు చేసేవాళ్ళతోనూ మనం మెలగాలి. ఆలోచనలు, సాత్వికమైన

భావాలు ఉన్న పరిణతి చెందిన వ్యక్తులతో మనం సత్సంబంధాలు కలిగి ఉండాలి. క్రమంగా దీనివల్ల ఆత్మవిశ్వాసం కలుగుతుంది. ఆత్మవిశ్వాసం నుంచి ఆత్మానుభూతి ఆవిర్భవిస్తుంది.

ప్రేమానందా! మీకు కృతజ్ఞతలు.

ప్రే. మీకు ఎంతో కృతజ్ఞుణ్ణి నాన్నగారూ! ఇది ఎంతో సుందరమైన ముఖాముఖీ!

– ఈ "ముఖాముఖీ" ప్రేమానందగారి Blueprints of Awakening : Rare Dialogues With 16 Indian Masters On The Teachings of Sri Ramana Maharshi అన్న పుస్తకం నుంచి అనువదించబడింది. ఇది Open Sky Press Ltd, London వారి ప్రచురణ. ఇది అనువదించటానికి అనుమతించిన నాన్నగారికి, ప్రేమానందగారికి కృతజ్ఞతలు.

ఈశ్వరుని పాదాలమీద విశ్వాసం కలిగితే చాలు. మీ జీవితం సఫలమౌతుంది. మెదడులో పవిత్రత మాట - చేతలలో పవిత్రత, ఎంతో కొంత లేకపోతే ఈశ్వరుని పాదాల మీద దృష్టి నిలవదు. కొందరి ముఖాలు ఎప్పుడూ ప్రశ్నార్థకం గానే ఉంటాయి. వారు దుఃఖం వస్తే ఊరంతా పంచి పెడతారు. సంతోషం వస్తే తామే అనుభవిస్తారు. జపధ్యానాలే అభ్యాసం. దుఃఖం తలంపు లేకుండా రాదు. అది నీవు కాదు. జగడాలు అన్నీ మూలతలంపులోంచే లేస్తూ ఉంటాయి.

- శ్రీ నాన్నగారు

మన అహంకారమే మన అజ్ఞానం. నా గ్రామం, నా కుటుంబము, నా సాంప్రదాయం గొప్పదనే భావాలే తరువాత జన్మలలో మీకు జ్ఞానం పొందటానికి అడ్డు వస్తుంది. జ్ఞానాభివృద్ధికి కొండగుర్తు మీరు పక్షపాత రహితంగా ఉండటమే. వినయం ఉన్నవానికి సాధనతో పనిలేదు. కష్టాలు రాకుండా ఉండటం గొప్ప కాదు, కష్టాలు వచ్చినా చలించకుండా ఉండాలి. దేహప్రారబ్ధం ఆపుచేసుకోవటం వలన ప్రయోజనం లేదు. "ఎన్ని కష్టాలు వచ్చినా నా మనస్సుకు అశాంతిని కలుగజేయకు, కష్టాలు నిల్వ ఉంచకు, రానియ్యి" అని భగవంతుణ్ణి ప్రార్థించాలి. దేహం ఉండగానే రాగద్వేషాలు తట్టుకొనే శక్తి అలవర్చుకోవాలి.

\- శ్రీ నాన్నగారు

చెరువులో నీళ్లు ఉంటాయి. మన ఇంటికి రమ్మనమంటే రావు. ఒక కుళాయి ఏర్పాటుచేసుకోవాలి. అలాగే హృదయంలో ఆనందం ఉంది. నీవు ధర్మాన్ని ఆచరిస్తే నీ హృదయంలో ఉన్న ఆనందం నీ సహస్రారానికి అందుతుంది. మిమ్ములను గురించి ఎవరైనా అసూయ పడితే మన గురించి ఇలా అనుకొంటున్నారు ఏమిటి? అని అనుకొంటే ఆ అసూయను మీరు కూడా నేర్చుకొంటారు. మోసగించబడే ప్రారబ్ధం ఎంతకాలం ఉంటుందో మోసం చేసేవాడు ప్రక్కనే ఉంటారు.

- శ్రీ నాన్నగారు

అందరిలోనూ ఏ సత్యం ఉందో దాన్ని తెలియపర్చే తెలివే తెలివి. మిగిలిన తెలివి అంతా పాడు తెలివి. పుస్తకాలు చదివి మంచి మాటలు ఎవరైతే ఉపయోగించుకోరో వారు పుస్తకాలు చదవటం వలన ప్రయోజనం లేదు. మీలో ఉన్న "పొరపాటు నేను" లోంచి బయటపడకపోతే ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదు. నిర్మలంగా ఆలోచించండి. నిశ్చలంగా పనిచెయ్యండి. సహృదయంతో మాట్లాడండి.


- శ్రీ నాన్నగారు

తన స్వంతపని తప్ప ఇతరుల పని ఇతరుల క్షేమం చూడనివాని కన్న చీకటి గుహలో పాములా బ్రతకటం మంచిది. గుడిలో శివునికి అభిషేకం చెయ్యటంలో ఎంత ప్రశాంతంగా, నిర్మలంగా ఉంటావో అలాగే, నీ విధినిర్ణయం లో నీ కర్మలను చూచి నిర్మలంగా జీవించు, చిరాకూ పరాకుగా చెయ్యకుండా, ఇష్టంగా చెయ్యి. కర్మని యోగంగా చెయ్యి. కోరలు తీసిన పాము ఏమీ చెయ్యలేదు. నిష్కామకర్మ మానవుణ్ణి బంధించదు. అది చిన్న పని అయినా మనలను పవిత్రుణ్ణి చేస్తుంది.

- శ్రీ నాన్నగారు

ఒక కంటిలో "ప్రేమ" ఒక కంటిలో "కరుణ" అంటిం చుకో. జ్ఞానం రాక ఏమౌతుంది. మన ఇంటిలోని వారిని ప్రేమించటం కాదు. కనిపించే సృష్టిని ప్రేమించాలి. మనలను మనం గొప్ప చేసుకొంటే అహంకారం పెరుగుతుంది.

- శ్రీ నాన్నగారు



" గురువు మీకు చేసే సహాయము లోపల -
అది మీ కొలతలకు అందేదికాదు.
మీరు చేసే సాధనల కంటే గురువు మీకు ఇచ్చే
అనుగ్రహం ఎక్కువగా పనిచేస్తుంది.
జన్మజన్మలకు మీ వెంట ఉండి,
మిమ్మల్ని రక్షించేది మీ గురువు ఒక్కడే !"

- శ్రీ నాన్నగారు